www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 206 | గురువారం | 23 జూలై, 2026

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169



6

# ఉక్కపోత బీభత్సం

40 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు

2003 తర్వాత అత్యధిక ప్రాణనష్టం

## ఫ్రాన్స్‌లో వేడి గాలులకు 5,700 మందికిపైగా బలి

- ఒక్క జూన్ నెలలోనే అసాధారణ మరణాలు
- 2003 తర్వాత అత్యధిక ప్రాణనష్టం నమోదు

# నన్ను బలహీనపర్చే కుట్ర

పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ లక్ష్యం ఒక్కటే

## కొడంగల్‌లో రాజకీయంగా దెబ్బతీసేందుకు ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు

- ఈ నెల 30 నాటికి ఓటరు జాబితా ప్రక్షాళనను నూటికి నూరు శాతం పూర్తి
- అర్హులెవరూ ఓటు కోల్పోవద్దు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజానావ, వికారాబాద్:** కొడంగల్ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల ఆశీర్వాదంతోనే రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం తనకు లభించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన ఆయన స్థానిక నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రక్షాళన, నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై దిశానిర్దేశం చేశారు. కొడంగల్‌లో తన రాజకీయ పునాదులను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని సీఎం ఆరోపించారు. రాష్ట్రస్థాయిలో తనను ఎదుర్కోలేక కొడంగల్‌లో కాంగ్రెస్‌ను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ లక్ష్యం ఒక్కటేనని, రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.

### 22 శాతం ఓటర్ల నమోదు ఇంకా పెండింగ్

కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 1,96,626 మంది మాత్రమే ఓటరు నమోదు ప్రక్రియలో భాగమయ్యారని సీఎం తెలిపారు. ఇంకా 54,635 మంది, అంటే దాదాపు 22 శాతం మంది తరువాయి 2లో..

## 'నీట్' లీక్‌పై కేంద్రం సమాధానం చెప్పాలి



- ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ చెలగాటం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా కొడంగల్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ

2

## తెలంగాణకు కేంద్రం గుడ్‌న్యూస్

- రబీ ధాన్యం కొనుగోలుకు మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ఆమోదం
- మొత్తం కొనుగోలు లక్ష్యం 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు
- రైతులకు మార్కెట్ భరోసా
- వీఎల్‌టీఎస్ అమలుపైనా కీలక ఆదేశాలు

2

## ఉక్రెయిన్ సైన్యంలో భారీ ప్రక్షాళన

- కమాండర్ ఇన్ చీఫ్‌గా మైఖైలో ద్రపాటీ నియామకం
- యుద్ధ వ్యూహాలకు పదును.. డ్రోన్లు, వైమానిక రక్షణపై ప్రత్యేక దృష్టి
- మార్పులతో యుద్ధ పరిస్థితి మారదన్న రష్యా
- మాజీ రక్షణ మంత్రి ఫెడొరోవ్‌కు మద్దతుగా నిరసనలు
- ఆగని దాడులు.. మరింత ఉధృతం

6



# కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ

## లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం.. గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నేతల దూకుడు

- ఇరువర్గాల పరస్పర దాడులతో ఉద్రిక్తత
- ఇరు పార్టీల నుంచి పలువురి నేతల అరెస్టు



**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలతో హైదరాబాద్‌లో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లోనూ కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ తరువాయి 2లో..



## పదేళ్లలో 152 పేపర్ లీకులు

- ఒక్క దాంట్లోనూ దోషులను గుర్తించలేదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- కేంద్రం వైఫల్యాలపై ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి: రాహుల్ గాంధీ

2

### సీసీఐ పునరుద్ధరణపై
## మీ వైఖరేంటి?

- రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యం
- జాప్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆరు ప్రశ్నలతో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ
- సమాధానమివ్వాలని డిమాండ్



2

## ఎక్కడా పవర్ కట్ లేదు

- రికార్డు విద్యుత్ డిమాండ్‌నూ సమర్థంగా ఎదుర్కొన్న తెలంగాణ
- వర్షాకాలంలోనూ 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించాం
- దేశంలోనే తొలిసారి ఎలక్ట్రిసిటీ అంబులెన్స్ సేవలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



# ఎక్కడా పవర్ కట్ లేదు

- **రికార్డు విద్యుత్ డిమాండ్‌నూ సమర్థంగా ఎదుర్కొన్న తెలంగాణ**
- **దేశంలోనే తొలిసారి ఎలక్ట్రిసిటీ అంబులెన్స్ సేవలు**
- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ప్రజానావ, హనుమకొండ:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరిగినా, తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా దానిని ఎదుర్కొందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే పీక్ విద్యుత్ డిమాండ్ ఈసారి అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరిందని, అదే సమయంలో జలాశయాల్లో నీటి లభ్యత తగ్గడంతో సుమారు 2,000 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళికతో పనిచేయడం వల్ల ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించగలిగామని పేర్కొన్నారు. హనుమకొండలోని టీజీఎన్ పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి భారీ ఎత్తిపోతల పథకాల విద్యుత్ అవసరాలతో పాటు వర్షాభావం కారణంగా రైతులు బోర్‌వెల్‌ల వినియోగాన్ని పెంచడంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందని భట్టి తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన నిర్వహణతో ఎక్కడా విద్యుత్ కొరత రానీయలేదన్నారు. రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగా పవర్ కట్‌లు అమలు చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో చెట్లు విద్యుత్ లైన్లపై పడటం లేదా స్తంభాలు దెబ్బతినడం వల్ల మాత్రమే తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందని, దానిని పవర్ కట్‌గా భావించవద్దని ప్రజలకు సూచించారు. ప్రజా బాట, పొలం బాట వంటి కార్యక్రమాల ద్వారా అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారని భట్టి ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో అధిక వడ్డీతో తీసుకున్న రుణాలను పునర్వ్యవస్థీకరించడం ద్వారా డిస్కంల ఆర్థిక భారం తగ్గించి, వాటిని దేశంలోనే అత్యుత్తమ విద్యుత్ పంపిణీ సంస్థలుగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

### మరింత వేగవంతంగా విద్యుత్ సేవలు

విద్యుత్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ అంబులెన్స్ సేవలను ప్రారం భించినట్లు ఆయన ప్రకటించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లు, అవసరమైన పరికరాలతో పాటు శిక్షణ పొందిన ఇంజినీర్లు ఈ ప్రత్యేక వాహనాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేస్తే, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత వ్యవస్థ ద్వారా ఫిర్యాదు వెంటనే నమోదు అయి, సమీపంలోని ఎలక్ట్రిసిటీ అంబులెన్స్‌కు సమాచారం చేరుతుందని, అత్యల్ప సమయంలో సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని వివరించారు. విద్యుత్ శాఖకు వెన్నెముకైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల విద్యుత్ బిల్లుల మొత్తాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు చెల్లిస్తోందని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు అవసరమైన ఉచిత విద్యుత్ సబ్సిడీగా ఏటా రూ.14 వేల కోట్లను కూడా ప్రభుత్వం డిస్కంలకు విడుదల చేస్తోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ నాగరాజు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వేములవాడను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### విప్ ఆది శ్రీనివాస్

**ప్రజానావ, వేములవాడ :** వేములవాడ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రూ.49.50 లక్షల వ్యయంతో డంపింగ్ యార్డుకు వెళ్లే అప్రోచ్ సీసీ రోడ్డు, టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని ప్రజలకు సూచించారు. పట్టణంలో డ్రైనేజీ ఆధునీకరణ, రోడ్ల విస్తరణ, మూడో వంతెన నిర్మాణం, రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయాభివృద్ధితో పాటు పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల సహకారంతో వేములవాడను పరిశుభ్రమైన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమీషనర్ లోకేష్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# నీట్ లీక్‌పై దేశవ్యాప్తంగా ఆందోళనలు

- **విద్యార్థి సంఘాలు, విపక్షాల నిరసనలు ఉధృతం**
- **ఢిల్లీ, పట్నాలో పోలీసులతో ఘర్షణలు.. టియర్ గ్యాస్, వాటర్ క్యానన్ల ప్రయోగం**

**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, విపక్ష పార్టీల ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని, లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పలు రాష్ట్రాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన దీక్ష రెండో రోజూ కొనసాగగా, రాత్రి సమయంలో ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. కొందరు నిరసనకారులు భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. కొందరు కర్రలతో భద్రతా సిబ్బందిపై దాడి చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల్లో కూడా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగాయి. బీహార్‌లోని పట్నాలో లోక్‌భవన్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు లాఠీచార్జి చేయడంతో పాటు వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఆందోళన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ నిరసనలతో నీట్ లీకేజీ వ్యవహారం మరింత రాజకీయ, సామాజిక ప్రాధాన్యత సంతరించుకుంది.

# సోనమ్‌జీ దీక్ష విరమించాలి

- **దేశానికి ఆయన అవసరం**
- **ఎక్స్ వేదికగా సీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కే విజ్ఞప్తి**
- **డిమాండ్లు నెరవేరే వరకూ జంతర్‌మంతర్‌లో శాంతియుత ఉద్యమం కొనసాగుతుందని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ:** సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కే విజ్ఞప్తి చేశారు. దేశానికి సోనం వాంగ్‌చుక్ అవసరమని, ఆయన ప్రాణం ఎంతో విలువైనదని పేర్కొంటూ బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు చేశారు. తన పోస్టులో, సోనం వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం. దేశానికి ఆయన అవసరం ఉంది. ఆయన ప్రాణాన్ని మరింత ప్రమాదంలో పడనివ్వకూడదు. ఆయన డిమాండ్లు నెరవేరే వరకు జంతర్‌మంతర్ వద్ద శాంతియుత నిరసనలు కొనసాగుతాయి అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కొద్ది రోజుల క్రితం ఢిల్లీ పోలీసులు జంతర్‌మంతర్ నుంచి ఆయనను ఆసుపత్రికి తరలించారు. తొలుత ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్పించిన అనంతరం, హైకోర్టు ఆదేశాల ప్రకారం గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మేదాంత ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న సోనం వాంగ్‌చుక్ వైద్యులు అందిస్తున్న బలవంతపు ఫీడింగ్‌ను నిరాకరిస్తూనే తన ఆమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# తెలంగాణకు కేంద్రం గుడ్‌న్యూస్

- **రబీ ధాన్యం కొనుగోలుకు మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ఆమోదం**
- **మొత్తం కొనుగోలు లక్ష్యం 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు**
- **రైతులకు మార్కెట్ భరోసా**
- **వీఎల్‌టీఎస్ అమలుపైనా కీలక ఆదేశాలు**

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్రంలో రబీ సీజన్‌లో సేకరించే ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచుతూ అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే నిర్ణయించిన లక్ష్యానికి అదనంగా ఈ పరిమాణాన్ని చేర్చడంతో మొత్తం కొనుగోలు లక్ష్యాన్ని 43 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (సీఎంఆర్)గా కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రబీ సీజన్‌లో పండించిన పంటకు మద్దతు ధరతో కొనుగోళ్లు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రైతులకు ఆర్థికంగా ఊరటనివ్వడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత సజావుగా నిర్వహించేందుకు దోహదపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ (వీఎల్‌టీఎస్) అమలుపై కూడా కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత కలిగిన వాహనాల్లో వీఎల్‌టీఎస్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. ఈ రెండు అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కొనుగోళ్ల నిర్ణయం రైతులకు ప్రయోజనం చేకూర్చడంతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు.

## ప్రతి ఓటరును చేరుకునే లక్ష్యంతో ఇంటింటి సర్వే

- **ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం**
- **దయ్యాల దాసు, కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏ–2**



**ప్రజానావ, హైదరాబాద్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతం చేసే దిశగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని 160వ పోలింగ్ బూత్ పరిధిలో బీఎల్‌ఓ ఎస్.కే.యం. రాజుతో కలిసి కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏ–2 దయ్యాల దాసు ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా చేరుకుని వారి వివరాలను ధృవీకరించి, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా దయ్యాల దాసు మాట్లాడుతూ.. 160వ పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 834 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 351 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. మరో 483 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటికే సుమారు 40 శాతం పని పూర్తయిందని చెప్పారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని వెల్లడించారు.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని దయ్యాల దాసు పేర్కొన్నారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఖచ్చితంగా నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని అన్నారు.అం దువల్ల ఓటర్లు ఇంటింటి సర్వేకు పూర్తి సహకారం అందించి, అవసరమైన వివరాలను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు

- **ఒక్క దాంట్లోనూ దోషులను గుర్తించలేదు**
- **ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**
- **కేంద్రం వైఫల్యాలపై ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి: రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ:** గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయినప్పటికీ ఇప్పటివరకు ఒక్క కేసులోనూ అసలు దోషులను గుర్తించి శిక్షించలేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావంగా బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ మొత్తం రిగ్గింగ్‌కు గురైందని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని రాహుల్ ఆరోపించారు. ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చేస్తున్న ఈ డిమాండ్ పూర్తిగా సమంజసమని పేర్కొన్నారు. గత పదేళ్లలో 152 పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని, అంటే సగటున ప్రతి వారానికి ఒక ప్రశ్నపత్రం లీక్ అయినట్లేనని రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఘటనల కారణంగా కోట్లాది మంది విద్యార్థులు నష్టపోయినా, ఇప్పటివరకు ఒక్క కేసులోనూ దోషులకు శిక్ష పడలేదని విమర్శించారు. ఈ పరిస్థితిపై విద్యార్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. ఒకప్పుడు దేశానికి బలమైన ఆస్తిగా ఉన్న విద్యా వ్యవస్థ ఎన్డీయే పాలనలో తీవ్రంగా దెబ్బతిందని ఆయన ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్నత విద్య అందని భారంగా మారిందన్నారు. నీట్ పరీక్ష కోసం విద్యార్థులు కోచింగ్‌కు ఏటా సుమారు రూ.1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది కేంద్ర విద్యా బడ్జెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థ సంపన్నులకు అనుకూలంగా మారిందని, పేద విద్యార్థులకు అవకాశాలు కష్టతరమయ్యాయని విమర్శించారు.

### లాఠీచార్జిపై ఆగ్రహం

ఇటీవల విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు లాఠీచార్జి చేయడంపై రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ యువతకు క్షమాపణలు చెప్పాలని కోరారు. దేశవ్యాప్తంగా జరిగిన పేపర్ లీక్‌ల కారణంగా సుమారు 7.5 కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారని రాహుల్ తెలిపారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కేసుల్లో ఇప్పటివరకు శిక్షపడిన వారి సంఖ్య సున్నా అని పేర్కొన్నారు. దేశ యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ప్రభుత్వం దెబ్బతీస్తోందని రాహుల్ ఆరోపించారు. పరిశ్రమలు మూతపడటం, కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం, పెద్ద వ్యాపార వర్గాలకు మాత్రమే అనుకూల విధానాలు అమలు కావడం వల్ల పేదలు, మధ్యతరగతి, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

### ప్రతిపక్ష నేతగా అది నా బాధ్యత

విద్యార్థుల ఆందోళనను కాంగ్రెస్ పార్టీ రాజకీయాల కోసం వినియోగించుకోవడం లేదని, ప్రతిపక్ష నేతగా వారి గళాన్ని వినిపించడం తన బాధ్యత అని రాహుల్ స్పష్టం చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు అవకాశం ఇవ్వకపోవడంతోనే ప్రజల మధ్యకు వచ్చామని తెలిపారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, ప్రజల కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరేంటి?

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **ఆరు ప్రశ్నలతో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ**
- **సమాధానమివ్వాలని డిమాండ్**

**ప్రజానావ, హైదరాబాద్:** ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారం పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ అత్యంత కీలకమని, రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్ల వాటా సమకూర్చితే కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించడం సాధ్యమవుతుం దని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే పునరుద్ధరణలో జాప్యానికి ప్రధాన కారణమని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీసీఐ పునరుద్ధరణకు మద్దతుగా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీసీఐ పునరుద్ధరణ కోసం చేసిన ప్రతిపాదనలను కూడా లేఖలో ప్రస్తావించిన కేటీఆర్, ఆదిలాబాద్ ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి లోపం కారణంగానే ఈ అంశం ముందుకు సాగలేదని ఆరోపిస్తూ, సీసీఐ పునరుద్ధరణకు సంబంధించి ఆరు కీలక ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల సీసీఐ పునరుద్ధరణ అంశంపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం, సీసీఐ సాధన సమితి సభ్యులతో కలిసి న్యూఢిల్లీ వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసిన విషయం తెలిసిందే. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, మాజీ మంత్రి జోగు రామన్న, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు సాధన సమితి ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు.

### మరో వందేళ్ల నిల్వలు

1980వ దశకంలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ సీసీఐ కర్మాగారం ఒకప్పుడు ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 6 వేల మందికి ఉపాధి కల్పించిందని ఆయన గుర్తు చేశారు. ప్లాంట్‌కు మరో వందేళ్ల పాటు సరిపడా సున్నపురాయి నిల్వలు ఉన్నాయని, సంవత్సరానికి 4 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ పరిశ్రమను తిరిగి నడిపే పూర్తి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఆదిలాబాద్ సీసీఐని పునరుద్ధరిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహీర్ కూడా ఇదే విషయాన్ని చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కర్మాగారాన్ని పునరుద్ధరించకుండా తుక్కుగా విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## నన్ను బలహీనపర్చే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఓటర్లు నమోదు ప్రక్రియ పూర్తి చేయలేదన్నారు. వీరి ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మిగిలిన అర్హులైన ఓటర్లందరినీ తిరిగి నమోదు చేయించే బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపై ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటు హక్కు కోల్పోతే వ్యక్తి ప్రజాస్వామ్య గుర్తింపే కోల్పోయినట్లేనని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఓటరు ధ్రువీకరణ ఫారాలు నమోదు చేయించాలని సూచించారు.

### ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లపై లక్ష్యం

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగు తున్నాయని సీఎం ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కాంగ్రెస్‌కు దెబ్బతీయాలనే ఉద్దేశంతో గూడుపుఠాణి రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలను ఎన్నికల అధికారులకు సకాలంలో అందించడం బీఎల్‌ఏల ప్రధాన బాధ్యత అని గుర్తు చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ఈ నెల 30 నాటికి ఓటరు జాబితా ప్రక్షాళనను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని రేవంత్‌రెడ్డి సూచించారు.

# నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం సమాధానం చెప్పాలి

- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
- **రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా కొడంగల్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ**

**ప్రజానావ, వికారాబాద్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అరెస్టును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బుధవారం భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ, నిరసన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో మాట్లాడుతూ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరీక్షల ప్రశ్నపత్రాలు కోట్ల రూపాయలకు అమ్ముడవుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా నీట్ ప్రశ్నపత్రాల లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, విద్యార్థులపై లాఠీచార్జి చేయడం దురదృష్టకరమని రేవంత్‌రెడ్డి విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్న ఆయన, నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్, ఇండియా కూటమి చర్చ కోరినా కేంద్ర ప్రభుత్వం అనుమతించలేదని ఆరోపించారు. లోక్‌సభ స్పీకర్ కూడా చర్చకు అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో నిరసన సందర్భంగా రాహుల్ గాంధీపై పోలీసులు దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని, స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతోందని అన్నారు. మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని, ఆయనను హత్య చేసిన గాడ్సే భావజాల వారసులే ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్నారని బీజేపీపై విమర్శలు గుప్పించారు.

### తొలగించే వరకూ ఉద్యమం

దేశ యువత భవిష్యత్తును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి తొలగించే వరకు ఈ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వెనుకడుగు వేయదని అన్నారు. అంతకుముందు రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

# కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ!

(మొదటిపేజీ తరువాయి)

బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

### నెక్లెస్ రోడ్ టు లోక్‌భవన్

తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్ రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్–ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

## మౌలిక వసతుల పనుల్లో
# నాణ్యతకు ప్రాధాన్యం

- స్మశానవాటిక, భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ వెంకన్న
- వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం



**ప్రజానావ, వరంగల్:** గ్రేటర్ వరంగల్ నగరంలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించిన ఆయన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ముందుగా వరంగల్ పరిధిలోని ఉర్సుగుట్ట సమీపంలోని హిందూ స్మశానవాటికను సందర్శించి అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం శివనగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని నాలాను పరిశీలించి వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా నాలాల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ నీటి నిల్వలు, మురుగు పేరుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భద్రకాళి బండ్ సమీపంలోని నాలాతో పాటు భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనుల పురోగతి, నాణ్యత, గడువులు, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు. నగరాభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్‌బాబు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్రం

- నీట్ పరీక్షల లీకేజీ, రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్ట్‌పై భగ్గుమన్న నిరసనలు
- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం



**ప్రజానావ, పెద్దపల్లి :** విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని మూడు నెలల కిందట నీట్ పరీక్ష లీక్ కావడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న తీరును నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు ఆధ్వర్యంలో బుధవారం కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు, యువజన సంఘాల కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తమ నిరసనను గట్టిగా చాటారు. ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ ఆందోళన సమాచారం అందుకున్న ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై నరేష్ తదితర పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుని పక్కకు తొలగించారు. ఆందోళనకారులను నిలువరించి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మీడియాతో మాట్లాడుతూ దేశంలో గడచిన 12 ఏళ్ల పాలనలో ఏకంగా 12 సార్లు ప్రశ్నపత్రాలు లీకయ్యాయని, నిరుద్యోగ యువత, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేస్తోందని ధ్వజమెత్తారు. మొన్నటికి మొన్న నీట్ పరీక్ష లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని, మానసిక వేదనతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం అత్యంత బాధాకరమన్నారు. ప్రాణాలు కోల్పోయిన ప్రతి విద్యార్థి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, పదేళ్లలో కోట్లాది మంది యువతను మోసగించిందని విమర్శించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తూ వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం,అక్రమ అరెస్టులకు పాల్పడడం మోడీ ప్రభుత్వ అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేని యెడల రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు నూగిల్ల మల్లన్న, బిరుదు రాధాకృష్ణ , వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు మినుపాల ప్రకాష్ రావు, కూర మల్లా రెడ్డి, రామిడి తిరుపతి రెడ్డి, కొమ్ము పోచాలు, సింగిల్ విండో చైర్మన్లు సామ రాజేశ్వర్ రెడ్డి, చిలుక సతీష్, ముత్యాల నరేష్, కళ్లేపల్లి జానీ, మండల పార్టీ అధ్యక్షులు గాజవేన సదయ్య, భూషణవేణ సురేష్ గౌడ్, బూతగడ్డ సంపత్, వేగోలం అబ్బయ్య గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్, సారయ్య గౌడ్, సయ్యద్ మస్రత్, ఆరె సంతోష్, దాన్నాయక దామోదర్ రావు, ఆడేపు వెంకటేష్, ఆర్కుట్ సంతోష్, ప్రదీప్, నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన సంఘాల కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## తలకు తీవ్ర గాయాలైతే.. అత్యవసర చికిత్సే ప్రాణాలు కాపాడుతుంది

ట్రామాకేర్‌పై కరీంనగర్ మెడికవర్ వైద్యుల అవగాహన సదస్సు

**ప్రజానావ, జమ్మికుంట:** రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలైన బాధితులకు అత్యవసర చికిత్స అందించడం ద్వారానే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎంతో మెరుగ్గా ఉంటాయని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే వీలైనంత త్వరగా అన్ని సౌకర్యాలున్న ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయాలన్నారు. బుధవారం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో అత్యవసర వైద్యం (ట్రామా కేర్) మరియు న్యూరో కేర్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ దిలీప్ రెడ్డి, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో తలకు లేదా వెన్నముకకు గాయాలైనప్పుడు బ్రెయిన్ హెమరేజ్ (మెదడులో రక్తస్రావం) అయ్యే ప్రమాదం ఎక్కువ ఉంటుందన్నారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజానావ, మంచిర్యాల :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్ మరియు చెన్నూర్ అసెంబ్లీ శాసనసభ్యులు& తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు డా గడ్డం వివేక్ వెంకటస్వామి, డీసీసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి ఆదేశాను సారం చెన్నూర్ లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి గాంధీ చౌక్వరకు ర్యాలీగా వెళ్ళి పాత బస్టాండ్ బిఆర్. అంబేద్కర్ చౌక్ వద్ద బీజేపీ అసమర్థ పాలనపై పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నీ, కాంగ్రెస్ పార్టీ నాయకుల మరియు యువతపై లాఠీచార్జ్, ఇదేనా మోదీ అచ్చే దిన్..? జాడి రాజేందర్ చెన్నూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇంటి ఎదుట కాంగ్రెస్ పార్టీ నిరసన తెలియజేస్తున్న, లోక్ సభ ప్రతి పక్ష నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ,కే సి వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ తో సహా, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేరళం సీఎం సతీశన్ సహా పార్టీ ఎంపీలు, సీనియర్ నాయకులు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అసమర్థ పాలనపై, పేపర్ లీకులపై శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని, రాజ్యసభ సభ్యులను, ఎంపీలను, సీఎంలను, సీనియర్ నాయకులను, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, కాషాయ కసాయి పాలకులు చేసిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాను. భావి భారతాన్ని తీర్చిదిద్దే యువతపై లాఠీలు ప్రయోగించడం మోదీ ప్రభుత్వ అహంకారానికి, నియంతృత్వ ధోరణికి నిదర్శనం. పేపర్ లీకులతో విసిగిపోయి, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను శత్రువుల్లా చూస్తూ, బూటుకాళ్ల కింద తొక్కిపడేయడమేనా మీ 'అచ్చే దిన్'? విద్యార్థులపై పడ్డ ప్రతి లాఠీ దెబ్బకు, చిందిన ప్రతి రక్తపు బొట్టుకూ బిజెపి పార్టీ ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించక తప్పదు. తమ న్యాయమైన హక్కుల కోసం, భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతకు, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. యువత పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది. అని జాడి రాజేందర్ చెన్నూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చెన్నూర్ పట్టణంలో నిరసన కార్యక్రమ వేదికగా మాట్లాడుతు... ఈ అక్రమ అరెస్టులను యూత్ కాంగ్రెస్ తరుపున తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హాజరైన ప్రముఖులు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షులు జంగపల్లి సంజయ్, మండల వైస్ ప్రెసిడెంట్ లింగంపల్లి మహేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్, వైస్ చైర్మన్ నాయకపు వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి, కౌన్సిలర్లు అంబటి శంకర్, అజీముద్దీన్, సుంకరి శిరీష సంతోష్, సుద్దపల్లి సునీత సుశీల్, నజ్మా అమీర్, కో–ఆప్షన్ సభ్యులు:– సాధనబోయిన క్రిష్ణ, సయ్యద్ సాహిర్, కాజా బేగం ఖలీల్, మండల అధ్యక్షులు, ముత్యాల బపాగౌడ్ మంచిర్యాల జిల్లా కార్యదర్శులు చింతల శ్రీనివాస్, కొండ వెంకటేశ్వర్లు, నాయకులు మెరుగు చైతన్య, పాతర్ల నాగరాజు, ఎండీ నవాజ్, దాసరి కమలాకర్ ఎండీ హాజ్, ఎండీ సుల్తాన్, ఎండీ ఖదీర్, ఎండీ కరీం, SK సలీం, ఎండీ జావీద్, Sk అతిఫ్, కడవండి మహేష్, నవీన్ సచిన్, లక్ష్మణ్, చింతల వెంకటేష్, ఇబ్రహీం షరీఫ్, ఎండీ వసీం, భోగి మధు, బీమ్ మధు, గుండేటి మధు, తుంగపండి అనిల్, సయ్యద్ ఇంతియాజ్, కట్ల లీనా, లక్ష్మీ తగరం నాగరాజ్, నివురు శేఖర్, శ్రీనివాస్, పెండ్యాల శ్రీకాంత్, లక్మన్, పెద్దకొండ ప్రశాంత్ చింతకింది ప్రశాంత్, జాడి శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.



## సర్ ప్రక్రియ గడువును సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజానావ, వేములవాడ;** సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కార్యక్రమం పటిష్టవంతంకై, పారదర్శకతకై,సంపూర్ణవంతంకై, విజయవంతంకై ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని,ఎన్నికల సంఘం పొడగించిన 10 రోజుల గడువు ఆగస్టు 3 వ తేదీతో ముగిస్తున్నందున ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని,అమూల్యమైన ఓటును సద్వినియోగ పరుచుకోవాలని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా బీఎల్ఓలు మరియు బీఎల్ఏ లు తీవ్రంగా కృషిచేయాలని అఖిలపక్ష నేతల సమీక్ష సమావేశంలో ఆర్డీఓ కే. ఎస్. బి.కుమారి గారు అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో మొత్తం 2,29,132 మంది ఓటర్లకు గాను నేటి వరకు 1,94,433 మంది ఓటు హక్కును నమోదుచేసుకున్నారని,84.86 శాతం ఓటరు నమోదు జరిగిందన్నారు. సమావేశంలో అఖిలపక్ష నేతలు పొలాస నరేందర్, మైలారం రాము, పిన్నింటి హన్మాండ్లు,చింతలకోటి రామస్వామి గౌడ్, శ్రావణ్ ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్, ఖర్గే పట్ల ఢిల్లీ పోలీసుల వైఖరిని ఖండించిన కాంగ్రెస్

- లేబర్ కాలనీ జంక్షన్‌లో రాస్తారోకో.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- విద్యార్థులపై లాఠీచార్జీ, కాంగ్రెస్ నేతల అరెస్టులపై ఆగ్రహం

**ప్రజానావ, వరంగల్ :** ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని, అనంతరం ప్రధాని నివాసం వద్ద నిరసన తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తదితరుల పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లేబర్ కాలనీ జంక్షన్‌లో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్‌రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఆందోళన చేస్తున్న వారిపై లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలకు మాట్లాడే అవకాశం కల్పించకుండా వారి గొంతు నొక్కారని ఆరోపించారు. అదే విషయంపై నిరసనగా ప్రధాని నివాసం వద్ద ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. ఈ ఘటనలను ఖండిస్తూ వరంగల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రాస్తారోకో కారణంగా భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఏసీపీ రమణకుమార్ ఆధ్వర్యంలో మిల్స్ కాలనీ సీఐ రమేష్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చింతాకుల అనిల్, బోగి సువర్ణ సురేష్, సోమిశెట్టి ప్రవీణ్, వస్కుల బాబు, పోశాల పద్మస్వామి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సంగరబోయిన చందర్, నాయకులు చిన్నపటేల్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీపై కవిత తీవ్ర విమర్శలు

- విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్
- నీట్ పేపర్ లీక్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**ప్రజానావ, హైదరాబాద్:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. భారతీయ జనతా పార్టీ కాదని, అది బ్రిటీష్ జాహిల్ పార్టీ అని విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై సీసీటీవీ కెమెరాలు నిలిపివేసి, ఇంటర్నెట్ సేవలను నిలిపేసి లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. ఈ మేరకు విడుదల చేసిన వీడియో సందేశంలో మాట్లాడిన ఆమె, బ్రిటీష్ పాలనలో ప్రజలపై జరిగిన దాష్టీకాలను బీజేపీ ప్రభుత్వం మరోసారి గుర్తు చేస్తోందని ఆరోపించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, విద్యార్థులపై జరిగిన పాశవిక దాడికి కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులపై గతంలో, ఇప్పుడు విద్యార్థులపై దాడులు చేయడం బీజేపీ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. పోలీసుల లాఠీచార్జ్‌లో 90 మంది విద్యార్థులు గాయపడగా, ఒక విద్యార్థిని ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను రోడ్లపై తరుముతూ రక్తాలు వచ్చేలా కొట్టడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం తగదని, ప్రజలకు సమాధానం చెప్పలేని ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. నీట్ పేపర్ లీక్ కారణంగా 25 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొంటూ, బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పేపర్ లీక్‌కు బాధ్యులను గుర్తించి అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పారదర్శకంగా వ్యవహరించలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, విద్యార్థులు ధైర్యం కోల్పోకుండా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులపై విరిగిన ప్రతి లాఠీకి, చిందిన ప్రతి రక్తపు చుక్కకు దేశ ప్రజలు ఓటుతో సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఇదే సందర్భంగా స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి అగ్రిగేటర్ సంస్థల్లో పనిచేస్తున్న గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల సమస్యలపైనా కవిత స్పందించారు. రోజంతా కష్టపడుతున్నా వారి ఆదాయం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని అగ్రిగేటర్ సంస్థలతో చర్చించి గిగ్ వర్కర్లు, డ్రైవర్లకు తగిన పారితోషికం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల పక్షాన ప్రభుత్వం నిలవాలని, గిగ్ వర్కర్లు, డ్రైవర్లకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



## భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అమరావతికి చెందిన జూనియర్ సివిల్ జడ్జి గౌరవనీయులైన శ్రీ లిఖిత గారు తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీ లిఖిత గారు మరియు వారి కుటుంబ సభ్యులకు స్వామి–అమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ప్రోటోకాల్ పర్యవేక్షకులు పెరుక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా

**ప్రజానావ, కోనరావుపేట :** ఇటీవల కురిసిన వర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామ హైస్కూల్ కు వచ్చే ప్రధాన దారి, టాయిలెట్‌కు వెళ్లే మార్గం బురదమయంగా మారి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా వెంటనే స్పందించి, వెంటనే మట్టి పోయించి దారిని చదును చేయించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యమే తనకు ముఖ్యమని పేర్కొంటూ గ్రామాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. రోడ్డు బాగు చేయించడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ ధర్నా

ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



**ప్రజానావ, గోదావరిఖని:** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నిరుద్యోగ యువతపై దాడిని ఖండిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట ఆందోళనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ బుధవారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం ఎదుట రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనని అన్నారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శంకుస్థాపన

- రూ.5.61 కోట్ల అంచనా వ్యయంతో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ పనులు



**ప్రజానావ, రామగుండం:** ఎన్‌టీపీసీ ప్రభావిత ప్రాంతాల్లో రూ.561 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బుధవారం న్యూ పోరట్‌పల్లిలో శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 2, 32, 33, 34, 49 డివిజన్లలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వర్షపు నీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వర్షాకాలంలో నీరు నిలిచిపోయే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ ప్రభావిత ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి డివిజన్‌లో నాణ్యమైన రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థలు, వర్షపు నీటి పారుదల సౌకర్యాలను కల్పించి ప్రజలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు!

పాలన బ్రహ్మాండంగా చేస్తుం టే.. పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవు తుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యా యి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫ ల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వ హించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందు కు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేప ర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే... పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనవ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు,

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిపూదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుం టే.. పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవు తుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యా యి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫ ల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వ హించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందు కు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేప ర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీ యాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే... పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనవ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదేశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివ రించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్క రించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందిం చలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీ యం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమ నిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని ంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శన ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్ర లో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా ంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారుల ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత ంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభు త్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శన ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించ డానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది.

రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానా లు, సంస్కరణలు, జవాబుదారీతనం అందిం చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది.

EDITORIAL

## జాతీయ పతాకానికి ఘన వందనం

- జెండా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం
- విద్యార్థుల్లో దేశభక్తి, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపే లక్ష్యం

**ప్రజానావ, నల్లగొండ:** జాతీయ పతాకం పట్ల గౌరవ భావం, దేశభక్తి చైతన్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో జాతీయ జెండా దినోత్సవం (నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డే) సందర్భంగా మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పొడవైన త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా ప్రదర్శిస్తూ జాతీయ పతాకానికి ఘన వందనం సమర్పించారు. భారత త్రివర్ణ పతాకం దేశ ఐక్యత, సమగ్రత, త్యాగస్ఫూర్తికి ప్రతీక అని, ప్రతి భారతీయుడు జాతీయ పతాకాన్ని అత్యంత గౌరవంతో చూడడం తన బాధ్యతగా భావించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరెడ్డి రఘురాం రెడ్డి విద్యార్థులకు వివరించారు. నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డే నిర్వహణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ చైతన్యం, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంపొందించడమేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ పతాకానికి ఘనంగా గౌరవ వందనం సమర్పించారు. ప్రధానోపాధ్యాయులు కేతిరెడ్డి రఘురాం రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీట్ అక్రమాలపై ప్రధాని మోడీ రాజీనామా చేయాలి

- విద్యార్థులపై లాఠీచార్జీ, కాంగ్రెస్ నేతల అరెస్టులను ఖండించిన కాంగ్రెస్
- గజ్వేల్‌లో భారీ ర్యాలీ, కేంద్ర మంత్రుల దిష్టిబొమ్మల దహనం




**ప్రజానావ, గజ్వేల్:** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో బుధవారం విద్యార్థులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన వారు కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్‌మంతర్, పార్లమెంట్ సమీపంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులకు సంఘీభావంగా ప్రధాని నివాసం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఈడ్చుకెళ్లడం తీవ్రంగా ఖండించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ధర్మేంద్ర ప్రధాన్‌కు ప్రధాని మోడీ మద్దతు ఇవ్వడాన్ని ప్రజలు అంగీకరించరని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవినీతి, అక్రమా లను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేయడం, రాజకీయ వేధింపులకు పాల్పడు తోందని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ కనకయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుఖేంద ర్‌రెడ్డి, నాయకులు కర్ణాకర్, ఐలయ్య, నర్సింలు, షాదుల్లా, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సర్పంచులు ఛానరెడ్డి, గోపాల్, కర్ణాకర్, ప్రశాంత్, కౌన్సిలర్లు నర్సింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, విష్ణు, రమేష్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, డాక్టర్ వహీద్, కరుణాకర్‌రెడ్డి, జకీర్, అజహార్, ప్రమోద్, బాబు, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి

- మంత్రి తుమ్మల
- తాగునీటి సంరక్షణకు కార్యాచరణ.. రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం
- రూ.1.75 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన






**ప్రజానావ, ఖమ్మం:** తాగునీటిని సంరక్షించు కుంటూ రైతులు అధిక నీటి అవసరమున్న వరి, మిర్చి పంటలకు బదులుగా ఆయిల్ పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించి, తాగు నీటి సంరక్షణ, నీటి లభ్యత, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఏప్రిల్ నుంచే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపైనే ఆధారపడితే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. 1977 కరువు కంటే సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశ ముందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉన్నందున తాగునీటి పరిరక్షణపై అప్రమత్తంగా ఉండా లని సూచించారు. ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాల కోసం ప్రజలు ఎదురుచూ స్తున్నారని పేర్కొన్న మంత్రి, గతంలో ప్రారం భించిన సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ప్రస్తుతం జిల్లాకు గోదావరి జలాలు అందుతు న్నాయని తెలిపారు. ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం కొనసాగుతోందన్నారు. మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, అక్కడి నుంచి మున్నేరు ద్వారా ఖమ్మం నగర తాగునీటి అవసరాలను తీర్చే ప్రయత్నాలు చేస్తున్నామని, అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. సుమారు రూ.90 కోట్ల వ్యయంతో నిర్మించిన రాజీవ్ కాలువ ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని, ఈ ప్రాజెక్టును విజయవంతం చేసిన ఇంజినీర్లను అభినందించారు. పశ్చిమా సియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిం దని, అపోహలను నమ్మవద్దని రైతులకు సూచించారు. అలాగే వీబీజీఆర్ఏఎం నిధులతో ఎన్ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని, ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాట కుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల కు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా ఉందని, వర్షాలు లేకుంటే తాగునీటి సమస్య తలెత్తే అవకాశముందని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్ వరకు తాగునీటి అవసరాలు తీర్చేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి జలాలను తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్‌ను నింపే అవకాశాలను ఇంజి నీర్లు పరిశీలిస్తున్నారని, ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షి స్తున్నట్లు వెల్లడించారు. వర్షాలు కురవని పరిస్థితుల్లో వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్య మవుతుందని, ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంత రం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.1.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఇరిగేష న్ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డీపీఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారు లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ వేగవంతానికి బీఎల్ఏలే కీలకం

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఇంటింటికీ ఫారాలు అందించి ఓటరు నమోదును పూర్తి చేయాలని పిలుపు
- త్వరలో ఎల్‌వీ ప్రసాద్ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్.. ప్రతి వార్డులో మొబైల్ పరీక్షలు



**ప్రజానావ, సిద్దిపేట:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించా లని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏలు, పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ, ఎన్యూమరేషన్ ఫారాలను ఇంటింటికీ అందజేసి, పూర్తిగా నింపించి తిరిగి సేకరించి బూత్ లెవల్ అధికారు లకు అందించడం ద్వారా ఓటరు నమోదు ప్రక్రియ విజయవంతమవు తుందని తెలిపారు. ప్రస్తుతం సిద్ది పేట పట్టణంలో 70 శాతానికి పైగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తైం దని, మిగిలిన ప్రాంతాల్లోనూ అధిక శాతం నమోదు జరిగేలా బీఎల్ఏలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్స రాలు పూర్తి చేసుకునే ప్రతి ఒక్కరూ ఫారం–6 ద్వారా ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్‌కు దూరమైన వారికి ఓటరు కార్డు ఆధా రంగా ఫారాలు నింపించి అందజే యాలని, అలాగే డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించి బూత్ లెవల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఓటరు పేరు జాబితాలో లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆగస్టు 10 తర్వాత క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా సిద్దిపేటలో త్వరలో ఎల్‌వీ ప్రసాద్ ఆధ్వ ర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ఏర్పాటు చేయను న్నట్లు హరీశ్‌రావు వెల్లడి ంచారు. ప్రస్తుతం ఉన్న ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఎదు రుగా ఈ కేంద్రానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని సింధు క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో పట్టణంలోని ప్రతి వార్డులో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక వాహనం అందుబాటులోకి రానుందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకునేలా మాజీ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు విస్తృతంగా అవగాహన కల్పించాలని హరీశ్‌రావు కోరారు.

## కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టుకు నిరసన

**ప్రజానావ, సూర్యాపేట:** దేశ రాజధాని ఢిల్లీలో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేసిన లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనే తల అరెస్టును ఖండిస్తూ సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షు డు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకుడు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటన కు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్య దర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతి నక్షత్రం సందర్భంగా వైభవంగా గిరి ప్రదక్షిణ

### వేలాదిమంది భక్తుల పాల్గొనికతో ఆధ్యాత్మిక శోభ

**ప్రజానావ, యాదగిరిగుట్ట:** శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి జన్మనక్షత్ర మైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దంపతులు ఆలయ కార్యనిర్వాహణాధికారి భవానీ శంకర్‌తో కలిసి స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ముఖమండపంలో అర్చకులు శతఘటాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న బీర్ల ఐలయ్య దంపతులతో పాటు గోరంట్ల మాధవ్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం అందించగా, దేవస్థాన కార్యనిర్వాహ ణాధికారి భవానీ శంకర్ స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.







# యాదాద్రి దేవాలయ సిబ్బంది, అర్చకులకు ప్రత్యేక శిక్షణ

- భక్తులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా మూడు రోజుల కార్యక్రమం
- శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం

**ప్రజానావ, యాదగిరిగుట్ట:** భక్తులకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన సేవలు అందించడంతో పాటు దేవాలయాల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక విలువలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలోని సిబ్బంది, అర్చకులకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (సిటా) ఆధ్వర్యంలో యాదగిరి కొండపైని ప్రధాన కార్యాల యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆగమశాస్త్రాను సార పూజా విధానాలు, ఆలయ సంప్రదాయాల పరిరక్షణ, దేవాలయ నిర్వహణ, భక్తులతో మర్యాద పూర్వక వ్యవహారం, పరిశుభ్రత ప్రమాణాలు, సేవా దృక్పథం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ నిబంధనలు, పరిపాలనా అంశాల పై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. సిటా డైరెక్టర్ డాక్టర్ చిలకపాటి విజయరాఘవాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.ఎస్. కుర్మానంద స్వామి, జి.వి. శేషావతార స్వామి, ఎం.వి. రామారావు, దరూరి రామాచార్య స్వామి శిక్షణ అందించగా, మాజీ ప్రధానార్చకులు ఎన్. లక్ష్మీ నరసింహాచార్యులు కూడా పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమం ముగిసిన సందర్భంగా పాల్గొన్న అర్చకులు, సిబ్బందికి సిటా ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సిటా డైరెక్టర్‌తో పాటు శిక్షణ అందించిన అధ్యాపక స్వాములను దేవస్థానం తరఫున ఘనంగా సన్మానించారు.



# ఉక్కపోత బీభత్సం

- ఫ్రాన్స్‌లో వేడి గాలులకు 5,700 మందికిపైగా బలి
- జూన్ నెలలోనే అసాధారణ మరణాలు
- 2003 తర్వాత అత్యధిక ప్రాణనష్టం నమోదు

**పారిస్:** గత నెల ఫ్రాన్స్‌ను కుదిపేసిన చారిత్రక హీట్‌వేవ్ కారణంగా సాధారణ పరిస్థితులతో పోలిస్తే కనీసం 5,764 మంది అదనంగా మరణించినట్లు ఫ్రాన్స్ ప్రజారోగ్య సంస్థ వెల్లడించింది. జూన్ 17 నుంచి జూలై 2 వరకు వేడి గాలుల ప్రభావిత ప్రాంతాల్లో మొత్తం 21,674 మంది మరణించగా, సాధారణ పరిస్థితుల్లో ఈ సంఖ్య 15,910 మాత్రమే ఉండేదని గణాంకాల ఆధారంగా పేర్కొంది. హీట్‌వేవ్ సమయంలో నమోదైన అదనపు మరణాలు సాధారణ స్థాయికంటే 36 శాతం ఎక్కువగా ఉన్నాయని, 2003లో సుమారు 15 వేల మంది ప్రాణాలు కోల్పోయిన ఘోర హీట్‌వేవ్ తర్వాత ఇదే అత్యధిక మరణాలుగా నమోదయ్యాయని సంస్థ తెలిపింది.

### పారిస్‌లో తీవ్ర ప్రభావం

జూన్ 24, 25 తేదీల్లో ఫ్రాన్స్ చరిత్రలోనే అత్యధిక సగటు ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటగా, రాత్రివేళలూ రికార్డు స్థాయిలో వేడి కొనసాగింది. జూన్ 25 నుంచి 27 మధ్య మూడు రోజుల్లోనే సగానికి పైగా అదనపు మరణాలు సంభవించాయి. పారిస్ ప్రాంతంలోనే 1,999 అదనపు మరణాలు నమోదయ్యాయి. మొత్తం మరణాల్లో దాదాపు సగం మంది ఆసుపత్రుల్లో, మూడో వంతు మంది ఇళ్లలో, మిగతావారు ప్రధానంగా వృద్ధాశ్రమాల్లో మృతి చెందినట్లు ప్రజారోగ్య సంస్థ వెల్లడించింది.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కేంద్రం పరిశీలన?

- విద్యార్థులపై ప్రతీకార చర్యలు ఉండవని హామీ కోరిన సోనమ్ వాంగ్‌చుక్
- నీట్ బాధిత కుటుంబాలకు పరిహారంపై సానుకూల సంకేతాలు

**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఆందోళనలు చేపట్టిన విద్యార్థులపై ఎలాంటి శిక్షాత్మక లేదా ప్రతీకార చర్యలు తీసుకోకూడదని పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు లేఖ రాసిన ఆయన, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనను పరామర్శించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. విస్తృత స్థాయిలో జరిగిన చర్చల్లో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు వాంగ్‌చుక్ పేర్కొన్నారు. అలాగే నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనతో ఆత్మహత్యలకు పాల్పడిన అభ్యర్థుల కుటుం బాలకు తగిన పరిహారం అందించే విషయంపైనా కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. విద్యార్థులపై ఎలాంటి ప్రతీకార చర్యలు ఉండవని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తే తాను కొనసాగిస్తున్న దీక్షను విరమించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వాంగ్‌చుక్ ప్రకటించారు.

# పాక్‌లో పెరుగుతున్న హెచ్‌ఐవీ కేసులు

### కరాచీ ప్రభుత్వ ఆస్పత్రిలో 94 మంది చిన్నారులకు వైరస్ నిర్ధారణ

### ఆరుగురు మృతి..

### కారణాలపై దర్యాప్తు ప్రారంభం

**కరాచీ:** ప్రపంచంలోని అనేక దేశాల్లో హెచ్‌ఐవీ నియంత్రణలోకి వస్తున్న తరుణంలో పాకిస్తాన్‌లో మాత్రం వైరస్ వ్యాప్తి ఆందోళనకరంగా పెరుగుతోంది. ముఖ్యంగా కరాచీలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు 94 మంది చిన్నారులకు హెచ్‌ఐవీ సోకడం కలకలం రేపింది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు సింధ్ ప్రావిన్స్ ఆరోగ్య కార్యదర్శి హుసేన్ సంఘీ వెల్లడించారు. సింధ్ ఎంప్లాయీస్ సోషల్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కుల్సూమ్ బాయ్ వాలికా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలి హెచ్‌ఐవీ కేసు గత ఏడాది నవంబర్‌లో నమోదైందని, అప్పటి నుంచి కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు. ఈ నెలలోనే 16 కొత్త కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. చిన్నారులకు హెచ్‌ఐవీ ఎలా సోకిందనే అంశంపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఆస్పత్రిలో హెచ్‌ఐవీ పరీక్షలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని, ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 10 వేల మందిలో 120 మందికి వైరస్ నిర్ధారణ అయినట్లు వెల్లడించారు.

# ఉక్రెయిన్ సైన్యంలో భారీ ప్రక్షాళన

- కమాండర్ ఇన్ చీఫ్‌గా మైఖైలో డ్రపాటీ నియామకం
- యుద్ధ వ్యూహాలకు పదును.. డ్రోన్లు, వైమానిక రక్షణపై ప్రత్యేక దృష్టి
- మార్పులతో యుద్ధ పరిస్థితి మారదన్న రష్యా
- మాజీ రక్షణ మంత్రి ఫెడొరోవ్‌కు మద్దతుగా నిరసనలు



**కీవ్:** రష్యాతో రెండేళ్లకుపైగా కొనసాగుతున్న యుద్ధంలో మరింత సమర్థంగా ఎదుర్కొనే లక్ష్యంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సైన్య అత్యున్నత నాయకత్వంలో కీలక మార్పులు చేపట్టారు. ప్రజల ఒత్తిడి, రాజకీయ పరిణామాల నేపథ్యంలో కమాండర్–ఇన్–చీఫ్ జనరల్ ఒలెక్సాండర్ సిర్‌స్కీని పదవి నుంచి తప్పించి, 43 ఏళ్ల మేజర్ జనరల్ మైఖైలో డ్రపాటీని కొత్త సైన్యాధిపతిగా నియమించారు. గత వారం జరిగిన ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణలో రక్షణ మంత్రి మైఖైలో ఫెడొరోవ్ కూడా పదవి కోల్పోవడం గమనార్హం. కొత్త సైన్యాధిపతి డ్రపాటీ నేతృత్వంలో యుద్ధ వ్యూహాలను పునర్వ్యవస్థీకరించాలని జెలెన్‌స్కీ ఆదేశించారు. డ్రోన్లు, ఆధునిక ఆయుధాల వేగవంతమైన సరఫరా, వైమానిక రక్షణ వ్యవస్థ బలోపేతం, సైనిక సమీకరణలో సంస్కరణలు చేపట్టాలని సూచించారు. 2014లో క్రిమియాపై రష్యా ఆక్రమణ తర్వాత యుద్ధరంగంలో ఎదిగిన యువ కమాండర్‌గా డ్రపాటీకి మంచి గుర్తింపు ఉంది. ఉక్రెయిన్‌లో జరిగిన రాజకీయ, సైనిక మార్పులు యుద్ధరంగంలో ఎలాంటి ప్రభావం చూపవని రష్యా స్పష్టం చేసింది. క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రష్యా బలగాలే ఆధిపత్యంలో ఉన్నాయని, శాంతి చర్చల విషయంలో తమ పాత డిమాండ్లలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు.

### ఫెడొరోవ్‌కు ప్రజల మద్దతు

డ్రోన్ సాంకేతికత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మాజీ రక్షణ మంత్రి మైఖైలో ఫెడొరోవ్‌ను తిరిగి బాధ్యతల్లోకి తీసుకురావాలని కీవ్‌తో పాటు పలు నగరాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. జెలెన్‌స్కీ ఆయనకు ప్రభుత్వంలో మరో కీలక పదవిని ఆఫర్ చేసినప్పటికీ, దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

### ఆగని దాడులు

రాజకీయ మార్పుల మధ్య యుద్ధం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని వైల్డ్‌బెర్రీస్ గిడ్డంగులపై మరోసారి దాడులు చేయగా, రష్యా క్షిపణులు, డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. ఒడెస్సా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌పై జరిగిన రష్యా డ్రోన్ దాడిలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఇరు దేశాలు పరస్పర దాడులను మరింత తీవ్రతరం చేస్తుండటంతో యుద్ధం మరింత ఉధృతమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి.

# అవసరమైతే మరింత కఠినంగా..

- ప్రతి అమెరికా సైనికుడి ప్రాణానికి ఇరాన్ అనేక రెట్లు మూల్యం చెల్లించాలి
- సైనికుల త్యాగాన్ని ఎప్పటికీ మరవం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- మధ్యప్రాచ్యంలో మృతి చెందిన జవాన్లకు సైనిక లాంఛనాలతో అంతిమ వీడ్కోలు
- డోవర్ ఎయిర్‌బేస్‌లో డిగ్నిఫైడ్ ట్రాన్స్‌ఫర్‌కు అధ్యక్షుడి హాజరు
- వీర జవాన్లకు ట్రంప్ అశ్రునివాళి

**వాషింగ్టన్:** మధ్యప్రాచ్యంలో అమెరికా సైనికులపై జరిగిన దాడులకు ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ప్రతి అమెరికా సైనికుడి ప్రాణానికి ఇరాన్ అనేక రెట్లు మూల్యం చెల్లించాల్సిందే. అవసరమైతే మరింత కఠినంగా స్పందిస్తాం అని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు చేసిన అనంతరం మధ్యప్రాచ్యంలో విధి నిర్వహణలో వీరమరణం పొందిన నలుగురు అమెరికా సైనికుల భౌతికకాయాలను స్వదేశానికి తీసుకొచ్చే డిగ్నిఫైడ్ ట్రాన్స్‌ఫర్ కార్యక్రమానికి డెలావేర్‌లోని డోవర్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో హాజరై వారికి సైనిక లాంఛనాలతో నివాళులర్పించారు. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత ట్రంప్ పాల్గొన్న మూడో డిగ్నిఫైడ్ ట్రాన్స్‌ఫర్ కార్యక్రమం ఇదే. జోర్డాన్, ఇరాక్ దాడుల్లో నలుగురు వీరమరణం జోర్డాన్‌లో ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడుల్లో మరణించిన అమెరికా ఆర్మీ అధికారులు టైలర్ జేమ్స్ ఫీహన్ (25), ఇసబెల్లా గొంజాలెస్ (19)తో పాటు అదృశ్యమైన తర్వాత మృతి చెందినట్లు నిర్ధారించిన ఏంజెల్ ఎస్. రాంపర్‌సాద్ (28) భౌతికకాయాలను స్వదేశానికి తరలించారు. అలాగే ఇరాక్‌లో ఇరాన్ డ్రోన్ పేలుడులో మరణించిన మైఖేల్ ఇమ్మాన్యుయెల్ స్వింటన్ (30) భౌతికకాయాన్ని కూడా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### వారి త్యాగాన్ని దేశం మరవదు

డోవర్‌కు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్, అధ్యక్షుడిగా నిర్వర్తించాల్సిన అత్యంత బాధాకరమైన బాధ్యతల్లో ఇదొకటని అన్నారు. తమ బిడ్డను కోల్పోయిన కుటుంబాలను ఓదార్చడం ఎంతో కష్టమని పేర్కొంటూ మేం మిమ్మల్ని ప్రేమిస్తున్నాం.. మీ బిడ్డ చేసిన త్యాగాన్ని అమెరికా ఎప్పటికీ మరచిపోదు అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఇదిలాఉంటే ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్–అమెరికా యుద్ధం తర్వాత ఇప్పటివరకు 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. అమెరికా సైనికులపై దాడులకు ప్రతీకారంగా ఇప్పటికే ఇరాన్‌పై పలు వైమానిక దాడులు నిర్వహించామని, అవసరమైతే మరింత తీవ్ర చర్యలకు వెనుకాడబోమని ట్రంప్ స్పష్టం చేశారు.

### మరణానంతర గౌరవాలు

వీరమరణం పొందిన ఫస్ట్ లెఫ్టినెంట్ టైలర్ జేమ్స్ ఫీహన్‌కు మరణానంతరం కెప్టెన్ హోదాతో పాటు బ్రాంజ్ స్టార్, పర్పుల్ హార్ట్, కాంబాట్ యాక్షన్ బ్యాడ్జ్ పురస్కారాలు ప్రకటించారు. సార్జెంట్ మైఖేల్ ఇమ్మాన్యుయెల్ స్వింటన్కు స్టాఫ్ సార్జెంట్‌గా పదోన్నతితో పాటు అదే గౌరవ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది.

# భారతీయులకు యూఏఈ 'వీసా ఆన్ అరైవల్'పై స్పష్టత

- భారత పాస్‌పోర్ట్ ఒక్కటే సరిపోదు.. అదనపు అర్హతలు తప్పనిసరి
- కొత్తగా మరో ఆరు దేశాల వీసా, రెసిడెన్స్ పర్మిట్ ఉన్నవారికీ అవకాశం

**దుబాయ్:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వెళ్లే భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లకు యూఏఈ ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. కేవలం భారతీయ పాస్‌పోర్ట్ కలిగి ఉన్నంత మాత్రాన 'వీసా ఆన్ అరైవల్' సౌకర్యం లభించదని స్పష్టం చేసింది. నిర్దిష్ట దేశాలు జారీ చేసిన చెల్లుబాటు అయ్యే వీసా, గ్రీన్ కార్డ్ లేదా రెసిడెన్స్ పర్మిట్ ఉన్న భారతీయులకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుందని తెలిపింది. విదేశాల్లో నివసించే, తరచూ ప్రయాణించే భారతీయులకు మరింత సౌలభ్యం కల్పించే లక్ష్యంతో ఈ విధానాన్ని 2025 ఫిబ్రవరి నుంచి విస్తరించింది. వీసా ఆన్ అరైవల్ పొందాలంటే భారతీయ పాస్‌పోర్ట్‌కు కనీసం ఆరు నెలల గడువు మిగిలి ఉండటంతో పాటు అర్హత కలిగిన దేశాలు జారీ చేసిన చెల్లుబాటు అయ్యే వీసా, గ్రీన్ కార్డ్ లేదా రెసిడెన్స్ పర్మిట్ తప్పనిసరిగా ఉండాలి. గతంలో అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, యూరోపియన్ యూనియన్ సభ్య దేశాల వీసా లేదా నివాస అనుమతి ఉన్నవారికే ఈ అవకాశం ఉండగా, 2025 ఫిబ్రవరి 13 నుంచి ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల రెసిడెన్స్ పర్మిట్ కలిగిన భారతీయులకు కూడా ఈ అర్హతను యూఏఈ ప్రభుత్వం విస్తరించింది. ఈ నిబంధనలు యూఏఈలోని అన్ని ప్రవేశ కేంద్రాల్లో అమల్లో ఉంటాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రయాణికులు తమ వెంట కనీసం ఆరు నెలల గడువు ఉన్న భారతీయ పాస్‌పోర్ట్, అర్హత కలిగిన దేశం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే వీసా, గ్రీన్ కార్డ్ లేదా రెసిడెన్స్ పర్మిట్‌తో పాటు అవసరమైన ఇతర ప్రయాణ పత్రాలను తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించింది. ప్రయాణ తేదీనాటికి సంబంధిత వీసా లేదా రెసిడెన్స్ పర్మిట్ చెల్లుబాటులో ఉండాలని, విమానయాన సంస్థలు, ఇమ్మిగ్రేషన్ అధికారులు ఈ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ప్రవేశానికి అనుమతి ఇస్తారని పేర్కొంది. అర్హత ఉన్న భారతీయులకు సాధారణంగా 14 రోజుల వీసా ఆన్ అరైవల్ మంజూరు చేస్తారని, అవసరమైతే నిబంధనల ప్రకారం మరో 14 రోజుల పాటు ఒకసారి పొడిగించుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. వీసా కేటగిరీలు, రుసుములు మారే అవకాశం ఉన్నందున ప్రయాణానికి ముందు తాజా నిబంధనలను యూఏఈ ఇమ్మిగ్రేషన్ లేదా సంబంధిత విమానయాన సంస్థ ద్వారా నిర్ధారించుకోవాలని సూచించింది. కేవలం విదేశాల్లో నివసించడం మాత్రమే ఈ సదుపాయానికి అర్హత కాదని, తప్పనిసరిగా అర్హత కలిగిన దేశం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే వీసా లేదా రెసిడెన్స్ పర్మిట్ ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ జాబితాలో లేని దేశాల్లో నివసించే భారతీయులు ప్రయాణానికి ముందే యూఏఈ వీసా పొందాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# కిమీ కే3తో ఏఐ రంగంలో చైనా దూకుడు

### అమెరికా ఆధిపత్యానికి సవాల్‌గా కిమీ కే3

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో చైనా మరో కీలక ముందడుగు వేసింది. చైనా సంస్థ మూన్‌షాట్ అభివృద్ధి చేసిన అత్యాధునిక ఏఐ మోడల్ కిమీ కే3 ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకు అత్యంత శక్తివంతమైన ఏఐ మోడళ్లలో అమెరికాకు చెందిన ఆంత్రోపిక్ మైథోస్ ముందంజలో ఉండగా, కిమీ కే3 దానికి సమాన స్థాయి సామర్థ్యాలు కనబరుస్తోందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఏఐ రంగంలో అమెరికా ఆధిపత్యానికి చైనా గట్టి సవాల్ విసిరినట్లయిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే కిమీ కే3 ఆ సమీకరణాన్ని మార్చివేసిందని భావిస్తున్నారు. భారీ డేటా విశ్లేషణ, సంక్లిష్ట యుద్ధ వ్యూహాల రూపకల్పన, స్వయంచాలక ఆయుధ వ్యవస్థలు, సైబర్ భద్రత, తయారీ, రక్షణ వంటి కీలక రంగాల్లో ఈ మోడల్ అత్యంత వేగంగా, సమర్థంగా పనిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని నిపుణులు చెబుతున్నారు.

# మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

- విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ
- నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన

**న్యూఢిల్లీ :** వరుసగా మూడో రోజు డా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టుబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం డా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో డా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.

# ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే నీట్‌పై చర్చ

### రాజ్యసభలో తేల్చి చెప్పిన కాంగ్రెస్ నేత ఖర్గే

**న్యూఢిల్లీ :** నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలంటే.. ంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తేల్చి చెప్పారు. బుధవారం రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. 'నీట్ అంశంపై నిష్పక్షపాతంగా చర్చ జరగాలంటే.. ంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా చేసేంతవరకు ఎలాంటి చర్చా ఉండదు' అని అన్నారు. దీనిపై లీడర్ ఆఫ్ ది హౌస్, ంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. 'ప్రభుత్వం చర్చకు వెనకడుగు వేయడం లేదు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారా



ల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పుడే చాలా స్పష్టంగా చెప్పారు. నీట్ పేపర్ లీజీకి సంబంధించిన అన్ని విషయాలపై డా చర్చించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కానీ, ప్రతిపక్షాలు నిరసనలతో సభను అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు.

# నీట్ లీక్‌పై రాజకీయాలు తగవు

### తోలైతన చర్చకు ప్రభుత్వం సిద్దంగా ఉంది: నడ్డా

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటు వేదికగా లోతైన చర్చకు తాము సిద్ధమేనని ంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పేపర్ లీక్ అంశం, విద్యార్థుల నిరసనలతో రాజకీయాలు వద్దని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని అన్నారు. విద్యార్థుల డిమాండ్స్, సమస్యలతో రాజకీయం చేసి లాభం పొందేందుకు ప్రయత్నించడం తగదని మంత్రి జేపీ నడ్డా అన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించట్లేదని మంత్రి నడ్డా ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్,



తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, రళ, కర్ణాటక రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని అన్నారు. వలం ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోని అంశాలనే ఎందుకు ఎంచుకుంటున్నారని అన్నారు. 150 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయన్న రాహుల్ గాంధీ ఆరోపణపై డా మంత్రి స్పందించారు. ప్రతి సుపై దర్యాప్తు చేసేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని అన్నారు.

# చీర కొనివ్వలేదని భర్తను హత్య చేసిన భార్య

**ప్రజానావ, ముంబై:** చీర కొనివ్వలేదనే వివాదంతో భార్య భర్తను హత్య చేసిన ఘటన మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శారీరక వైకల్యంతో మంచానికే పరిమితమైన హరేరామ్ సింగ్ (35)కు కొత్త చీర కొనివ్వాలని భార్య సునీతా దేవి కోరగా, అతను తన పరిస్థితి కారణంగా నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి, ఆగ్రహించిన సునీత కుక్కర్‌తో భర్త తలపై బలంగా కొట్టి, అనంతరం గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం దొంగ నాటకం ఆడేందుకు పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చినా, ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారి ఏడేళ్ల కుమారుడి వాంగ్మూలంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు సునీతను అరెస్టు చేసి హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రధాని ఇంటిముందు ధర్నాకు కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్

- ఖర్గే నివాసానికి వెళ్లి.. గుట్టుచప్పుడు కాకుండా ధర్నా
- పోలీసులను ఆయోమయంలోకి నెట్టి కాంగ్రెస్ తీరు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని మోదీ నివాసం ముందు మంగళవారం కాంగ్రెస్ నేతలు మెరుపు ధర్నా చేపట్టిన విషయం పక్కా ప్లాన్‌తో చేపట్టినట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీజీతో పాటు సీజేపీ కార్యకర్తలపై లాఠీఛార్జ్ అంశంలో ఆ ధర్నా నిర్వహించారు. అయితే కట్టుదిట్టమైన లోక్ కళ్యాణ్ మార్గ్ కు కాంగ్రెస్ నేతలు అంతా ఎలా వెళ్లారని ఢిల్లీ పోలీసులు ఇప్పుడు ఆరా తీసే పనిలో పడ్డారు. వాస్తవానికి మంగళవారం కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఖర్గే ఇంటికి కాంగ్రెస్ నేతలు వెళ్లారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజాజి మార్గ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే నివాసం ఉన్నది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, సీ వేణుగోపాల్‌తో పాటు అనేక మంది ఎంపీలు తొలుత మల్లిఖార్జున్ ఖర్గే ఇంటికి వెళ్లారు. ఖర్గేకు 84వ పుట్టిన రోజు విషెస్ తెలిపారు. కానీ కాంగ్రెస్ నేతలు అకస్మాత్తుగా మరో ప్లాన్ వేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని ఇంటి వైపు ర్యాలీ తీశారు. ఖర్గే ఇంటికి కొన్ని వూటర్ల దూరంలోనే ప్రధాని మోదీ నివాసం ఉన్నది. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ఎంపీలు .. ప్రధాని మోదీ గేటు ముందు చేరుకున్నారు. అక్కడే మెరుపు దాడికి దిగారు. సుమారు మూడు గంటల పాటు బైఠాయించారు. ఢిల్లీ పోలీసులు ఈ ఘటనతో షాక్ అయ్యారు. స్యెర్టీ ఉల్లంఘన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కట్టుదిట్టమైన ప్రాంతంలోకి ఒసారి ఇంత మంది ఎలా వచ్చారని పోలీసులు ఆలోచిస్తున్నారు. అయితే ఖర్గే పుట్టినరోజు కావడం వల్ల ఆ ప్రాంతంలో భారీ సంఖ్యలో ఉదయం నుంచే జనం ఉన్నారని, రాజాజి మార్గ్‌లో అనేక వాహనాలను డా పార్క్ చేసినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 7 లోక్ కల్యాణ్ మార్గ్ లొషన్‌లో కాంగ్రెస్ ఎంపీలు ధర్నాకు దిగడం పట్ల ఢిల్లీ పోలీసులు కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు తెలిసింది.అయితే ఈ ఘటనకు ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియదు. కానీ ఢిల్లీ పోలీసులు మాత్రం స్యెర్టీ ఉల్లంఘన జరిగినట్లు అంగీకరిస్తున్నారు. ఖర్గే ఇంటికి చేరిన కాంగ్రెస్ నేతలు.. పార్లమెంట్ సవూపంలో ఉన్న విజయ్ చౌక్‌కు ర్యాలీ తీస్తారని భావించినట్లు కొందరు పోలీసులు చెప్పారు.

# చలో సంసద్‌పై పోలీసుల లాఠిన్యం

### అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ

**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ డా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు డా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీజీకి బాధ్యత వహిస్తూ ంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారిడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

# 50 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతాం

- టోక్యో ఒలింపిక్స్ తరహాలోనే ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టిస్తాం
- ప్రతి మ్యాచ్‌ను ఫైనల్‌గా భావించి బరిలోకి దిగుతాం
- పాక్‌తో మ్యాచ్ ఎప్పుడూ ప్రత్యేకమే..
- భావోద్వేగాలకంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యం
- భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్

**న్యూఢిల్లీ:** ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రపంచకప్ పతకాల నిరీక్షణకు ఈసారి ముగింపు పలకాలన్నదే భారత పురుషుల హాకీ జట్టు లక్ష్యమని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశాడు. టోక్యో ఒలింపిక్స్‌లో 41ఏళ్ల తర్వాత భారత్‌కు కాంస్య పతకం అందించిన జట్టు స్ఫూర్తితోనే ఈసారి ప్రపంచకప్‌లోనూ చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్నామని పేర్కొన్నాడు. ఆగస్టు 15 నుంచి 30 వరకు నెదర్లాండ్స్, బెల్జియంలో జరిగే ప్రపంచకప్‌పై ఆయన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశాడు. 1975లో ప్రపంచకప్‌ను గెలిచిన తర్వాత భారత్‌కు మరోసారి పతకం దక్కలేదని గుర్తుచేసిన హర్మన్‌ప్రీత్, ప్రస్తుత జట్టులోని పలువురు సీనియర్ ఆటగాళ్లకు ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉండటంతో చరిత్ర సృష్టించాలనే పట్టుదలతో అందరూ ఉన్నారని తెలిపాడు. జట్టులో ఆత్మవిశ్వాసం, ఐక్యత బలంగా ఉన్నాయని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే లక్ష్యమని చెప్పాడు. యూరప్‌లో జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో నెదర్లాండ్స్, జర్మనీ వంటి బలమైన జట్లపై సాధించిన విజయాలు ప్రపంచకప్‌కు మంచి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు. అయితే ప్రపంచకప్‌లో తప్పులకు రెండో అవకాశం ఉండదని, అందుకే ప్రతి మ్యాచ్‌ను ఫైనల్‌గా భావించి అత్యుత్తమ ప్రదర్శన




చేయాల్సి ఉంటుందని అన్నాడు. భారత జట్టు ఇప్పుడు పెనాల్టీ కార్నర్లపైనే ఆధారపడే పరిస్థితిలో లేదని, ఫీల్డ్ గోల్స్ సాధించడంలోనూ జట్టు గణనీయంగా మెరుగుపడిందని హర్మన్‌ప్రీత్ వివరించాడు. గోల్ ఎవరు చేశారన్నది కాకుండా జట్టు విజయమే ముఖ్యమని, వీడియో అనాలిసిస్ యుగంలో డ్రాగ్ ఫ్లికర్లకు సవాళ్లు పెరిగినా కొత్త వ్యూహాలతో వాటిని అధిగమిస్తున్నామని తెలిపాడు.

### యువ ఆటగాళ్లపై పూర్తి నమ్మకం ఉంది

ప్రపంచకప్‌లో అరంగేట్రం చేయనున్న యువ ఆటగాళ్లు ఇప్పటికే ప్రో లీగ్ ద్వారా అంతర్జాతీయ అనుభవాన్ని సంపాదించారని, వారిపై పూర్తి నమ్మకం ఉందని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు. ఒత్తిడికి లోనుకాకుండా సహజశైలిలో ఆడుతూ జట్టు ప్రయోజనాలను ముందుంచాలని వారికి సూచించినట్లు వెల్లడించాడు. ఇక గ్రూప్ దశలో పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్ ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని, అయినప్పటికీ భావోద్వేగాలకు లోనుకాకుండా జట్టు లక్ష్యాలకే ప్రాధాన్యం ఇస్తామని హర్మన్‌ప్రీత్ స్పష్టం చేశాడు. ప్రపంచకప్ అనంతరం జరిగే ఆసియా క్రీడల్లోనూ రాణించి 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడమే మరో ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. అలాగే కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంటున్న భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించాడు.



## రెండో రౌండ్‌కు సింధు, లక్ష్యసేన్

### చైనా ఓపెన్‌లో భారత షట్లర్ల శుభారంభం

**చాంగ్‌జౌ:** చైనా ఓపెన్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ రెండో రౌండ్‌కు చేరారు. మహిళల సింగిల్స్‌లో సింధు 21-14, 9-21, 21-10తో యువ షట్లర్ ఉన్నతి హుడాపై గెలిచి ప్రిక్వార్టర్స్‌లో చైనా స్టార్ చెన్ యూఫీతో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ జపాన్‌కు చెందిన యుషి తనాకాను 22-20, 15-21, 21-14తో ఓడించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాడు. ప్రపంచ 11వ ర్యాంకర్ అల్వీ ఫర్హాన్‌ను 17-21, 21-5, 21-17తో ఓడించిన అయుష్ శెట్టి సంచలన విజయం నమోదు చేశాడు. అయితే పురుషుల డబుల్స్‌లో హరిహరన్–ఎం.ఆర్. అర్జున్ జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్–రుత్విక శివాని, ధ్రువ్ కపిల–తనిషా క్రాస్టో జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి.

# భయపడొద్దు.. స్వేచ్ఛగా ఆడండి

## ఇంగ్లండ్ పర్యటనలో ఓటములు జట్టును మరింత దగ్గర చేశాయి

- విమర్శలను పట్టించుకోకుండా వర్తమానంపై దృష్టి పెట్టాలి
- యువ ఆటగాళ్లతో టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్



**హరారే:** వైఫల్య భయం ఆటగాడి ప్రతిభను దెబ్బతీస్తుందని, అందుకే ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా స్వేచ్ఛగా ఆడాలని భారత టీ20 జట్టు కెప్టెన్ శ్రేయ స్ అయ్యర్ యువ ఆటగాళ్లకు సూచించాడు. జింబాబ్వేతో గురువారం ప్రారంభమయ్యే మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడిన అయ్యర్, ఇంగ్లండ్ పర్యటనలో ఎదురైన నిరాశలు జట్టుకు విలువైన పాఠాలు నేర్పాయని, అవే జట్టును మరింత ఐక్యంగా మార్చాయని పేర్కొన్నాడు. ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఫలితాలు ఆశించిన విధంగా రాకపోయినా, జట్టుగా ఏ అంశాల్లో మెరు గుపడాలో స్పష్టత వచ్చిందని అయ్యర్ తెలిపాడు. మైదానంలో పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించడం, అవగాహనతో నిర్ణయాలు తీసుకోవడం, వేగం గా పరిస్థితులకు అలవాటు పడడం వంటి అంశాల్లో మరింత మెరుగుదల అవసరమని చెప్పారు. ఆ పర్యటన తనకు కెప్టెన్‌గా తొలి బాధ్యత కావడంతో మం చి అనుభవం లభించిందన్నారు. వైఫల్యం గురించి ముందుగానే ఆలోచిస్తే ఆటగాళ్లు తమను తాము కాపాడుకునేందుకే ప్రయత్నిస్తారని, అలాంటి భ యం లేకపోతేనే అత్యుత్తమ ఆట బయటపడుతుందని అయ్యర్ స్పష్టం చేశాడు. బయటివారి విమర్శల కంటే వర్తమానంపై దృష్టి పెట్టి జట్టుగా మంచి క్రికెట్ ఆడడమే ముఖ్యమని సూచించాడు. ఇంగ్లండ్ నుంచి నేరుగా జింబాబ్వేకు చేరుకుని ఒక్కరోజు సాధనతో నే మ్యాచ్ ఆడాల్సి రావడం సవాలేనని, అయితే ఇ లాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాణిస్తే ఆటగాళ్ల ఆత్మవి శ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నాడు. వరు స విదేశీ పర్యటనలు యువ ఆటగాళ్లకు అమూల్య మైన అనుభవాన్ని అందించాయని, భవిష్యత్తులో జట్టుకు అవి ఎంతో ఉపయోగపడతాయని అభిప్రా యపడ్డాడు.

### జింబాబ్వేను తక్కువగా అంచనా వేయొద్దు

జింబాబ్వేను తక్కువ అంచనా వేయరాదని అయ్యర్ హెచ్చరించాడు. ఆ జట్టులో ఐపీఎల్ అనుభవం ఉ న్న ఆటగాళ్లు ఉండటంతో వారు బలమైన ప్రత్యర్థులే నని చెప్పాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత తాను మానసికంగా మరింత దృఢంగా మారానని, ఒడిదుడుకులను త్వరగా అధిగమించడం నేర్చుకు న్నానని వెల్లడించాడు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీతో పాటు యువ ఆటగాళ్లు ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్య టనల ద్వారా మంచి అనుభవం సంపాదించారని, తమ తప్పులను వారు ఇప్పటికే సరిదిద్దుకుని ఉంటారన్నాడు.

# ఒడిదుడుకులు వచ్చినా ఆత్మవిశ్వాసం తగ్గలేదు

- జింబాబ్వే సిరీస్‌లో అవకాశం వస్తే రాణిస్తా
- హరారేలో అండర్–19 ప్రపంచకప్ జ్ఞాపకాలు ప్రత్యేకం
- టీమిండియా యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ

**హరారే:** గత నాలుగు నెలల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా తన ఆత్మవిశ్వాసం ఏమాత్రం తగ్గలేదని భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ముందు మాట్లాడుతూ, క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమేనని, ప్రక్రియను నమ్ముకుని జట్టుకోసం శాతం వంద కృషి చేస్తానన్నాడు. ఐపీఎల్ ప్రదర్శనతో భారత జట్టులో చోటు దక్కించుకున్న 15ఏళ్ల వైభవ్, ఇంగ్లండ్‌తో అరంగేట్రం చేసి అత్యంత పిన్న వయస్కుడైన భారత అంతర్జాతీయ క్రికెటర్‌గా నిలిచాడు. అనంతరం జట్టుకు దూరమైనా కోచ్‌ల నుంచి పూర్తి మద్దతు లభిస్తోందని, సాధనపై పూర్తి విశ్వాసం ఉందని చెప్పాడు. హరారే మైదానం తనకు ఎంతో ప్రత్యేకమని, ఇక్కడే అండర్–19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌ను విజేతగా నిలిపిన జ్ఞాపకాలు ఉన్నాయని గుర్తుచేశాడు. ఇక్కడి పరిస్థితులపై తనకు మంచి అవగాహన ఉందని, అవకాశం వస్తే ఆ అనుభవాన్ని ఉపయోగించి జట్టుకు కీలకంగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు.



Business
బిజినెస్

# శాంసంగ్ నుంచి కొత్త తరం ఫోల్డబుల్స్

- ఆగస్టు 7న మార్కెట్లోకి జెడ్8 సిరీస్
- భారత్‌లో తయారైన మూడు ప్రీమియం మోడళ్ల ఆవిష్కరణ
- నేటి నుంచి ప్రీ–బుకింగ్ ప్రారంభం
- రూ.10 వేల వరకు అప్‌గ్రేడ్ బోనస్, ప్రత్యేక ఆర్థిక ఆఫర్లు

**లండన్:** దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తన కొత్త తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ సిరీస్ గెలాక్సీ జెడ్8ను బుధవారం లండన్‌లో నిర్వహించిన అన్‌ప్యాక్డ్–2026 కార్యక్రమంలో ఆవిష్కరించింది. భారత్‌లో తయారైన ఈ ప్రీమియం స్మార్ట్ ఫోన్లు ఆగస్టు 7 నుంచి దేశవ్యాప్తంగా విక్రయాలకు అందుబాటులోకి రానుండగా, బుధవారం రాత్రి నుంచే ప్రీ–బుకింగ్ ప్రారంభమైంది. ఈ సిరీస్‌లోని ఫోన్ల ధరలు రూ.1.25 లక్షల నుంచి రూ.2.60 లక్షల వరకు ఉన్నాయి. గెలాక్సీ జెడ్8 సిరీస్‌లో గెలాక్సీ జెడ్ ఫోల్డ్8 అల్ట్రా, గెలాక్సీ జెడ్ ఫోల్డ్8, గెలాక్సీ జెడ్ ఫ్లిప్8 మోడళ్లను కంపెనీ విడుదల చేసింది. గత తరం మోడళ్లతో పోలిస్తే ఇవి మరింత సన్నగా, తక్కువ బరువుతో రూపొందించడమే కాకుండా, పెద్ద డిస్‌ప్లేలు, మెరుగైన బ్యాటరీ సామర్థ్యం, అధునాతన గెలాక్సీ ఏఐ ఫీచర్లతో వినియోగదారులకు మరింత మెరుగైన అనుభూతిని అందించేలా తీర్చిదిద్దింది.

### మేడిన్ ఇండియాకు ప్రాధాన్యం

శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా అధ్యక్షుడు, సీఈవో జేబీ పార్క్ మాట్లాడుతూ, ఈ సిరీస్‌లోని అన్ని ఫోన్లు భారత్‌లోనే తయారయ్యాయని తెలిపారు. దేశంలోని పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) సామర్థ్యాలను వినియోగిస్తూ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతతో ఈ ఉత్పత్తులను రూపొందించామని చెప్పారు.



### ధరలు.. ప్రత్యేక ఆఫర్లు

గెలాక్సీ జెడ్ ఫోల్డ్8 అల్ట్రా మూడు స్టోరేజ్ వేరియంట్లలో రూ.2 లక్షలు, రూ.2.20 లక్షలు, రూ.2.60 లక్షలుగా అందుబాటులో ఉన్నాయి. గెలాక్సీ జెడ్ ఫోల్డ్8 ధరలు రూ.1.80 లక్షలు, రూ.2 లక్షలు, రూ.2.40 లక్షలుగా నిర్ణయించారు. గెలాక్సీ జెడ్ ఫ్లిప్8 రెండు స్టోరేజ్ వేరియంట్లలో రూ.1.25 లక్షలు, రూ.1.45 లక్షలుగా విక్రయించనున్నారు. ప్రీ–బుకింగ్ చేసుకునే వినియోగదారులకు రూ.10 వేల వరకు అప్‌గ్రేడ్ బోనస్, లేదా రూ.9 వేల వరకు బ్యాంక్/యూపీఐ క్యాష్‌బ్యాక్, అలాగే 30 నెలల నో–కాస్ట్ ఈఎంఐ, జీరో డౌన్ పేమెంట్ వంటి ప్రత్యేక ఆర్థిక ఆఫర్లను కంపెనీ ప్రకటించింది.

### ఫోల్డబుల్ విభాగంపై ఫోకస్

ప్రస్తుతం భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో విక్రయాల పరంగా వివో తర్వాత రెండో స్థానంలో ఉన్న శాంసంగ్, గెలాక్సీ జెడ్8 సిరీస్ ద్వారా ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్ విభాగంలో తన మార్కెట్ వాటాను మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త డిజైన్, ఏఐ ఆధారిత ఫీచర్లు, అధిక పనితీరు, ఆకర్షణీయమైన ఆఫర్లతో ఈ సిరీస్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తుందని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఢిల్లీ– టొరొంటో ఎయిరిండియా నాన్‌స్టాప్ సర్వీసులు

- ఆగస్టు 1 నుంచి ఇంధన విరామం లేకుండానే నేరుగా విమానాలు
- కొత్త బోయింగ్ 787–9 డ్రీమ్‌లైనర్లతో రోజువారీ సర్వీసులు

**న్యూఢిల్లీ:** ఎయిరిండియా ఆగస్టు 1 నుంచి ఢిల్లీ–టొరొంటో మార్గంలో కొత్త బోయింగ్ 787–9 డ్రీమ్‌లైనర్ విమానాలతో నాన్‌స్టాప్ సర్వీసులను ప్రారంభించనుంది. ప్రస్తుతం వారానికి ఐదు రోజులుగా ఉన్న సర్వీసులను రోజువారీగా నిర్వహించనుంది. దీంతో ఢిల్లీ–టొరొంటో ప్రయాణ సమయం 20 గంటల నుంచి 17 గంటలకు తగ్గనుంది. 2025లో పాకిస్థాన్ గగనతలం మూసివేయడంతో ఈ మార్గంలో వియన్నాలో ఇంధన విరామంతో విమానాలు నడుస్తున్నాయి. కొత్త డ్రీమ్‌లైనర్లతో ఆ అవసరం తొలగనుంది. అయితే నాన్‌స్టాప్ సర్వీసులు అందుబాటులో ఉన్న గగనతల మార్గాలపై ఆధారపడి ఉంటాయని సంస్థ తెలిపింది. కొత్త విమానంలో 30 బిజినెస్ క్లాస్ సూట్లు, 28 ప్రీమియం ఎకానమీ, 238 ఎకానమీ సీట్లు ఉన్నాయి. తాజా




క్యాబిన్ సదుపాయాలతో భారత్–కెనడా ప్రయాణికులకు మరింత మెరుగైన అనుభవం అందించనున్నట్లు ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. ప్రస్తుతం ఎయిరిండియా వద్ద సుమారు 190 విమానాలు ఉన్నాయి.

## పసిడి పరుగులు.. పుంజుకున్న వెండి

- రెండు వారాల గరిష్ఠానికి బంగారం
- 10 గ్రాములకు రూ.1.49 లక్షలు
- కిలో రూ.8,500 పెరిగిన వెండి
- ప్రపంచ మార్కెట్ల ప్రభావంతో ధరల జోరు



**న్యూఢిల్లీ:** దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు బుధవారం భారీగా పెరిగి రెండు వారాల గరిష్ఠ స్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల ధోరణి, దేశీయంగా భౌతిక డిమాండ్ పెరగడంతో 10 గ్రాముల స్వచ్ఛమైన (99.9 శాతం) బంగారం ధర రూ.1,900 పెరిగి రూ.1,49,600కు చేరినట్లు అఖిల భారత సరాఫా సంఘం వెల్లడించింది. మంగళవారం ఈ ధర రూ.1,47,700గా నమోదైంది. వరుసగా ఆరు రోజుల పాటు తగ్గిన వెండి ధరలు బుధవారం బలంగా పుంజుకున్నాయి. కిలో వెండి ధర ఏకంగా రూ.8,500 పెరిగి రూ. 2,30,000కు చేరింది. అంతకుముందు సెషన్‌లో ఇది రూ.2,21,500 వద్ద ముగిసింది. విదేశీ మార్కెట్లలో బలమైన సంకేతాలు, భౌతిక కొనుగోళ్లు పెరగడం, గత వారం ధరలు తగ్గిన తర్వాత విలువ ఆధారిత కొనుగోళ్లు (వాల్యూ బాయింగ్) పెరగడం వల్ల బంగారం వరుసగా మూడో రోజు లాభపడిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు. గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు మళ్లీ పెరగడం కూడా ధరలకు మద్దతుగా నిలిచిందన్నారు.

### అంతర్జాతీయంగా అదే జోరు

అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 47.43 డాలర్లు (1.16 శాతం) పెరిగి 4,125.24 డాలర్లకు చేరగా, ట్రేడింగ్ సమయంలో 4,140 డాలర్ల రెండు వారాల గరిష్ఠాన్ని తాకింది. వెండి ఔన్సుకు దాదాపు 1 శాతం పెరిగి 59.32 డాలర్లకు చేరి 60 డాలర్ల స్థాయికి చేరువైంది. అమెరికా–ఇరాన్ చర్చలపై అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ, వచ్చే వారం జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశం పైనే బులియన్ మార్కెట్ దృష్టి కేంద్రీకృతమైంది. వడ్డీ రేట్లపై స్పష్టత వచ్చే వరకు బంగారం, వెండి ధరల్లో ఒడిదుడుకులు కొనసాగవచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మూడో రోజూ నష్టాల్లో మార్కెట్లు




**ముంబై:** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, బ్యాంకింగ్ షేర్లలో భారీ అమ్మకాలు కొనసాగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు ఒక శాతం మేర క్షీణించాయి. బీఎస్ఈ 30 షేర్ల సూచీ సెన్సెక్స్ 715.06 పాయింట్లు (0.92 శాతం) పడిపోయి 76,755.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్ మధ్యలో ఒక దశలో 828 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 191.45 పాయింట్లు (0.79 శాతం) క్షీణించి 23,996.25 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్ సూచీ 1.33 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.16 శాతం నష్టపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోగా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్‌టీపీసీ, పవర్ గ్రిడ్, టైటాన్ స్వల్ప లాభాల్లో ముగిశాయి. రియాల్టీ 2.62 శాతం, సేవల రంగం 1.97 శాతం, ప్రభుత్వ రంగ బ్యాంకులు 1.83 శాతం, ఐటీ 1.47 శాతం, ప్రైవేట్ బ్యాంకుల సూచీ 1.42 శాతం మేర పడిపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగం మాత్రమే లాభపడింది.

### చమురు ధరల ప్రభావం

అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర 4.68 శాతం పెరిగి బ్యారెల్‌కు 95.27 డాలర్లకు చేరింది. అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలు, హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో ప్రపంచ చమురు సరఫరాపై ఆందోళనలు పెరగడం, రూపాయి బలహీనపడడం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపినట్లు విశ్లేషకులు తెలిపారు.

## డాక్టర్ రెడ్డీస్ లాభాల్లో 69% క్షీణత

- తొలి త్రైమాసికంలో నికర లాభం రూ.434.8 కోట్లకు పరిమితం
- సెమాగ్లుటైడ్ ఏపీఐ సమస్య, ఉత్తర అమెరికా అమ్మకాల తగ్గుదల ప్రభావం

**న్యూఢిల్లీ:** డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ 2026–27 తొలి త్రైమాసికంలో సమీకృత నికర లాభం 69.2 శాతం తగ్గి రూ. 434.8 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ లాభం రూ.1,409.6 కోట్లు. మొత్తం ఆదాయం కూడా రూ. 8,545.2 కోట్ల నుంచి రూ.8,070.5 కోట్లకు తగ్గింది. సెమాగ్లుటైడ్ ఔషధ తయారీలో ఉపయోగించే ఏపీఐ నాణ్యత సమస్య కారణంగా నిల్వలు, ఇతర వ్యయాల కోసం రూ.239.7 కోట్ల ప్రొవిజన్ చేయాల్సి రావడం, ఉత్తర అమెరికాలో జనరిక్ ఔషధాల అమ్మకాలు 35 శాతం తగ్గడం కంపెనీ ఫలితాలపై ప్రభావం చూపాయి. అయితే భారత్‌లో జనరిక్ ఆదాయం 17 శాతం, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో 31 శాతం, యూరప్‌లో 13 శాతం పెరిగినట్లు కంపెనీ తెలిపింది. ప్రధాన వ్యాపారం కీలక మార్కెట్లలో రెండంకెల వృద్ధిని కొనసాగిస్తోందని, భవిష్యత్‌లో పెప్టైడ్స్, బయోసిమిలర్స్, వినూత్న ఉత్పత్తులపై దృష్టి సారిస్తున్నామని కంపెనీ సహ–చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు.





# 40శాతం షూటింగ్ పూర్తి అయిన 'స్పిరిట్'

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజు అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుం డగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచా రం వెల్లడిం చా రు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియే షన్ వేడుకల్లో



ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రావ్ గోపాల్ వర్మ డా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటి 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అకాడమీ టాపర్‌గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ–సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# ప్రశాంతత నన్నే వెతుక్కుంటూ వచ్చింది

వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటి అనుపమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు పంచుకుంది. ఇకపై తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలను తానే తీసుకుంటానని, ఎవరి అనుమతి అవసరం లేదని స్పష్టం చేసింది. ''కొన్నిసార్లు ప్రశాంతతను పొందాలంటే కొన్ని విషయాలను వదులుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆ ప్రశాంతత నన్నే వెతుక్కుంటూ వచ్చింది. ఇకపై నా గొంతు, నా జీవితం గురించి నిర్ణయాలు నేనే తీసుకుంటాను. ఎవరి అనుమతి అవసరం లేదు. భయాలు లేవు. మళ్లీ నన్ను నేను వెతుక్కుంటూ, దాదాపు మరిచిపోయిన జీవితంతో ప్రేమలో పడతాను'' అంటూ అనుపమ తన పోస్టులో పేర్కొంది. తనకు అండగా నిలిచి ప్రేమాభిమానాలు చూపిన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఆమె, అత్యంత క్లిష్ట సమయంలో వారి సందేశాలు, ప్రార్థనలు తనకు ఎంతో ధైర్యం ఇచ్చాయని వెల్లడించింది. తనను సరైన దారిలో నడిపించిన విశ్వానికి కూడా ధన్యవాదాలు తెలిపింది. ఇకపై ఎలాంటి సంకోచం లేకుండా తనకు నచ్చిన విధంగా జీవిస్తానని పేర్కొంది. అలాగే వేరొకరి అనుమతి, పాటల ఎంపిక లేదా క్యాప్షన్‌ల కోసం ఎదురుచూడకుండా స్వేచ్ఛగా పోస్టులు చేయడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పింది. కాగా, అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంలో కందుల సులోచన రాణి పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి

స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి డా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు.తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు డా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు.చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు ర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.ఆ



సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. సినీ పరిశ్రమలో స్థిరపడిన తర్వాత తమ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కుటుంబానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రమను ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి రమ ఆయన వ్యక్తిగత జీవితంలోనే కాకుండా వృత్తిపరమైన ప్రయాణంలోనూ ఎంతో సపోర్ట్‌గా నిలుస్తున్నారు.

# 'రంభ ఊర్వశి మేనక' నుంచి సాంగ్ విడుదల




అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక'. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించను న్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కును'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.

# 'జన నాయగన్'లో శ్రీలీలకు ఛాన్స్ మిస్

కోలీవుడ్ స్టార్, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ హీరోగా నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు సిద్ధమవుతోంది. బాలకృష్ణ నటించిన సూపర్ హిట్ చిత్రం **'భగవంత్ కేసరి'కి రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తెలుగులో శ్రీలీల పోషించిన కీలక పాత్రను తమిళ్ వెర్షన్‌లో యువ నటి మమితా బైజు పోషిస్తోంది. అయితే ఈ పాత్ర కోసం తొలుత శ్రీలీలనే పరిశీలించినట్లు దర్శకుడు హెచ్. వినోద్ తాజాగా వెల్లడించారు. రీమేక్‌లోనూ అదే పాత్రను ఆమెతో చేయించాలని మొదట భావించినట్లు, ఆమెతో పాటు మరికొందరు నటీమణుల పేర్లను కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఆ తర్వాత మమితా బైజు పేరును పరిశీలించి, చిత్రబృందంతో చర్చించిన అనంతరం ఆమెనే ఆ పాత్రకు ఖరారు చేసినట్లు వినోద్ వివరించారు. దీంతో తమిళ్ రీమేక్‌లోనూ శ్రీలీలకు మరో మంచి అవకాశం చేజారినట్లైంది. కాగా, 'జన నాయగన్' చిత్రానికి అనిరుద్ రవిచందర్ సంగీతం అందించగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది. విజయ్ నటించిన చివరి సినిమా కావడంతో ఈ చిత్రంపై అభిమానుల్లో విశేష ఆసక్తి నెలకొంది.

# నాకెలాంటి సర్జరీ జరగలేదన్న బిగ్‌బి

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇటీవల చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స, ఐసీయూ, కోలుకునే ప్రక్రియ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలతో అమితాబ్‌కు సర్జరీ జరిగిందని అభిమానులు భావించారు. అయితే ఈ ప్రచారాలపై తాజాగా ఆయన స్వయంగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. బిగ్ బీ తన బ్లాగ్‌లో శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం ఎంత కష్టమో వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. దీంతో ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందారని, సర్జరీ చేయించుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పోస్టు వెనుక అసలు ఉద్దేశాన్ని అమితాబ్ వివరించారు. నాకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదు. నేను పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నాను. నా పోస్ట్‌ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన స్పష్టం చేశారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూ నుంచి ఇంటికి వచ్చిన వ్యక్తి ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులను వలం ఒక ఉదాహరణగా మాత్రమే ప్రస్తావించానని చెప్పారు. ఇటీవల జరిగిన అర్జెంటీనా?స్పెయిన్ ఫిఫా మ్యాచ్‌ను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని అమితాబ్



వెల్లడించారు. ఒక ఛాంపియన్ ఓడిపోయిన తర్వాత తిరిగి నిలబడటం ఎంత కష్టమో చెప్పాలనుకున్నాను. ఫిఫా ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓడిన తర్వాత మెస్సి పరిస్థితిని ఊహించుకుని ఆ పోస్ట్ రాశాను. కానీ, అది నా ఆరోగ్యానికి సంబంధించినదిగా అందరూ భావించారు అని వివరించారు. అమితాబ్ ఇచ్చిన ఈ వివరణతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.

# 'పవర్ గ్రూప్'పై చివరివరకు పోరాడతా

మలయాళ చిత్రసీమను కుదిపేస్తోన్న హేమా కమిటీ నివేదిక వివాదంపై 'అమ్మ' (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్షురాలు శ్వేతా మేనన్ స్పందించారు. హేమా కమిటీ నివేదికలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 'పవర్ గ్రూప్'కు వ్యతిరేకంగానే తన పోరాటం కొనసాగుతోందని, అలాంటి వ్యక్తులు సంఘానికి నాయకత్వం వహించకుండా చివరివరకు పోరాడతానని స్పష్టం చేశారు. గతంలో జరిగిన సమావేశంలో తనను అవమానించి బయటకు పంపేందుకు ప్రయత్నించారని శ్వేతా మేనన్ ఆరోపించారు. తాను అధ్యక్షురాలిగా ఉన్నంత కాలం హేమా కమిటీ నివేదికలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని 'అమ్మ' సంఘం బాధ్యతల్లోకి రానివ్వనని, అందుకోసం ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికైనా వెనుకాడబోనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరి ఆర్థిక అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తినప్పుడు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. తన పోరాటం పూర్తిగా బాధితుల పక్షాన నిలబడేందుకేనని, పబ్లిసిటీ లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని ఆమె స్పష్టం చేశారు. తనపై వస్తున్న రాజకీయ, నిధుల ఆరోపణలను కూడా ఖండిస్తూ, కేరళలో అభ్యర్థులను వెతికిపెట్టేందుకు ఓ జాతీయ పార్టీ కోట్ల రూపాయలు ఇచ్చిందనే ప్రచారం పూర్తిగా నిరాధారమని అన్నారు. ఏ రాజకీయ పార్టీతోనైనా అనుబంధం ఉంటే దాన్ని దాచాల్సిన అవసరం తనకు లేదని, ఇలాంటి ఆరోపణలతో తనను భయపెట్టలేరని చెప్పారు. సత్యం గెలవడమే తన లక్ష్యమని, 'అమ్మ' సంఘానికి మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు. కాగా, 'అమ్మ' అధ్యక్ష పదవికి ఇచ్చిన రాజీనామాను శ్వేతా మేనన్ ఇటీవల ఉపసంహరించుకోగా, కోర్టు స్టే నేపథ్యంలో ప్రస్తుతం ఆమె అధ్యక్ష బాధ్యతలను కొనసాగిస్తున్నారు.

# ఆలయ ఉత్సవాల్లో విజయ్, త్రిషలతో బ్యానర్

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, స్టార్ హీరోయిన్ త్రిష పేర్లు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో తరచూ చర్చకు వస్తున్నాయి. వీరిద్దరి గురించి పలు రకాల ప్రచారాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో తమిళనాడులో జరిగిన ఓ ఆలయ ఉత్సవంలో విజయ్, త్రిష చిత్రాలతో ఏర్పాటు చేసిన బ్యానర్ ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. తమిళనాడులోని సేలం జిల్లా ఆత్తూర్‌లో జరుగుతున్న మారియమ్మన్ ఆలయ ఆషాఢ ఉత్సవాల సందర్భంగా కొందరు యువకులు ప్రత్యేక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఆ బ్యానర్‌లో విజయ్‌ను పది తలల రావణాసురుడి రూపంలో, త్రిషను అమ్మవారి రూపంలో చిత్రీకరించారు. ఈ డిజైన్ స్థానికంగా మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో డా వేగంగా వైరల్ అయింది. బ్యానర్ బయటకు రావడంతో నెటిజన్లు, స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయ ఉత్సవాల్లో సినీ ప్రముఖుల చిత్రాలను ఈ విధంగా ఉపయోగించడం సరికాదని పలువురు విమర్శించారు. ముఖ్యంగా దేవతా రూపాలతో నటీనటులను పోల్చి చూపడంపై ఆగ్రహం వ్యక్తమైంది. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో అధికారులు వెంటనే స్పందించారు. వివాదాస్పద బ్యానర్‌ను తొలగించడంతో పాటు, దానిని ఏర్పాటు చేసిన ఇద్దరు యువకులపై సు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# సంక్రాంతి బరి నుంచి చిరు తప్పకున్నారా?

ఒకప్పుడు సంక్రాంతి అంటే తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద పండుగగా భావించేవారు. ఆ సీజన్‌లో సినిమా విడుదలైతే భారీ వసూళ్లు ఖాయమనే నమ్మకం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లలో ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒసారి పలువురు స్టార్ హీరోల సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కోసం తీవ్ర పోటీ నెలకొంటోంది. ఫలితంగా స్క్రీన్లు పంచు కోవాల్సి రావడం, కలెక్షన్లు విడిపోవడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై ఓ



ఆసక్తికర ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడు తోంది. మొదట ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని చిత్రబృందం భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తున్నట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



# హీరోయిన్లకు తప్పని క్యాస్టింగ్ కౌచ్!

ప్రఖ్యాత హిందీ టెలివిజన్ నటి, 'తారక్ మెహతా కా ఊల్టా చష్మా' ఫేమ్ 'సింపుల్ కౌల్' చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న క్యాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని బహిరంగంగా వెల్లడించారు. కెరీర్ ప్రారంభంలో ఓ సినిమా ప్రాజెక్ట్ చర్చల పేరుతో ఓ నిర్మాత తనను హోటల్‌కు పిలిచి, అనంతరం వ్యక్తిగత గదికి ఒంటరిగా రావాలని కోరాడని ఆమె తెలిపారు. అయితే ముందుగానే స్నేహితులను వెంట తీసుకెళ్లిన తాను, ఆ ప్రతిపాదనను ధైర్యంగా తిరస్కరించినట్లు చెప్పారు. 2002లో ఏక్తా కపూర్ నిర్మించిన 'కుసుమ్' సీరియల్‌తో నటిగా పరిచయమైన సింపుల్ కౌల్, 'షరారత్', 'తారక్ మెహతా కా ఊల్టా చష్మా' వంటి సీరియళ్లతో మంచి గుర్తింపు పొందారు. ఇటీవల ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, హోటల్ లాబీలో కథ గురించి మాట్లాడేందుకు సిద్ధమని, కానీ వ్యక్తిగత గదిలోకి మాత్రం రానని నిర్మాతకు స్పష్టంగా చెప్పినట్లు వెల్లడించారు. పెద్ద అవకాశం వస్తుందన్న ఆశతో తన ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టలేదని పేర్కొన్నారు.తన కెరీర్ ప్రారంభం నుంచే ఎవరైనా హద్దులు దాటితే సహించేదాన్ని కాదని సింపుల్ కౌల్ తెలిపారు. కథా చర్చలు, సమావేశాలకు ఎప్పుడూ ఒంటరిగా వెళ్లలేదని, చిత్రబృందం సమక్షంలోనే చర్చల్లో పాల్గొనేదాన్నని చెప్పారు. తన నటనా జీవితంలో అసౌకర్యంగా అనిపించే పరిస్థితుల్లో ఎప్పుడూ రాజీ పడలేదని స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టే కొత్త నటీనటులకు ఆమె కీలక సూచనలు చేశారు. ప్రతిభ, నైపుణ్యంపైనే నమ్మకం ఉంచాలని, ఎంత పెద్ద అవకాశం వచ్చినా అంతరాత్మకు విరుద్ధంగా వ్యవహరించవద్దని సూచించారు. అవకాశాల కోసం రాజీ పడాల్సిన అవసరం లేదని, వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ మంచి సంబంధాలను ఏర్పరచుకోవడమే విజయానికి మార్గమని పేర్కొన్నారు.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277